

- విచ్చలవిడిగా పసుపురంగు, చైనా సాల్ట్ వినియోగం
- కల్తీ నూనె.. నిల్వ మాంసంతో అనారోగ్యంపాలే!
- నరాల బలహీనత, మెదడు రుగ్మతలు

ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలకు నీళ్లు

బిర్యానీ.. బాప్‌రే!

ఇంట్లో వండుకుంటే అద్భుతం.. బయట తింటే అనారోగ్యం

బిర్యానీ... ఈ పేరు చెబితే మాంసాహార ప్రియులకు నోరూరక తప్పదు. పుట్టిన రోజు, పెళ్లిరోజు, ఉద్యోగం వచ్చినా, ఇంటికి బంధువులొచ్చినా, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినా, ఇద్దరు స్నేహితులు కలిసినా ఇలా ఏ శుభకార్యమైనా బిర్యానీ రుచి చూడాల్సిందే! ఇలా ప్రతీ ఒక్కరి జీవితంలో బిర్యానీ ఓ పరిచయం లేని వంట అయ్యింది. ఈ ఎడారి వంట ఇంట్లో వండుకుని తింటే అద్భుతమైన రుచి.. అదే హోటళ్లలో తింటే అనారోగ్యంపాలు కావాల్సిందేనంటున్నారు వైద్యునిపుణులు. వ్యాపార రంగంలో పోటీని తట్టుకునేందుకు హోటళ్ల నిర్వాహకులు ఆకర్షణ కోసం రంగులు, రుచి కోసం రసాయనాలను కలిపే స్తుండటమే ఇందుకు కారణం. ప్రధానంగా అజినోమోటో (చైనాసాల్ట్)ను ఎక్కువగా వాడటం వల్ల నరాల బలహీనత, మెదడుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

- నెల్లూరు (సిటీ)



ఇంట్లో జరిగే ఏకార్యమైన ఖర్చు ఎక్కువని చక్కటి శాకాహార భోజనం మానేసి సింపుల్‌గా తక్కువ ఖర్చుతో వచ్చే బిర్యానీ ఆర్డర్ ఇస్తున్నాము. మన సంస్కృతికి అద్దంపట్టే శాకాహార భోజనానికి ఎప్పుడో టాటా చెప్పేసి అనారోగ్య మాంసాహార వంటలకు వెల్‌కం చెబున్నాము. ఇందులో బిర్యానీ ప్రధానమైంది. ఇంట్లో వండిన బిర్యానీ ఫర్వాలేదనిపించినా హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలలో వడ్డిస్తున్న బిర్యానీ ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు.

● అజినోమోటోతో తీవ్ర ప్రభావం

బిర్యానీ తయారీకి కచ్చితంగా అజినోమోటో వేయాల్సిందే. ఇది వేస్తే తప్ప మనకు కావాల్సిన రుచి రాదు. ఇది చైనా ఉప్పు. వ్యక్తి శరీరంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. నరాల బలహీనత, మెదడుపై ప్రతికూలతను చూపడం దీని ప్రత్యేకత. ఈ విషయాన్ని ఆరోగ్య భద్రత అధికారులు తేల్చారు కూడా. ప్రజలకు అవగాహన సదస్సులు పెట్టి మరీ వివరిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో దీని వాడకం కచ్చితంగా ఉంటుంది. అలాగే వంట నూనెను ఒకటికి రెండు సార్లు కాచడం వల్ల పెద్దగా ప్రమాదం లేదు కానీ అంతకు మించి కాచి వంటలో వాడితే మాత్రం అత్యంత ప్రమాదకరం. ఇలా కాయడం వల్ల నూనె సహజత్వాన్ని కోల్పోయి రసాయనంగా మారుతుంది. ఈ విషయాన్ని కూడా ఎఫ్‌ఎస్‌వోలు గుర్తించారు. బిర్యానీలోకి కావాల్సిన వివిధ రకాల డిష్‌లలో ఈ తరహా కాచిన నూనెనే ఎక్కువగా వాడుతున్నట్లు ఎఫ్‌ఎస్‌వోల తనిఖీల్లో వెల్లడైంది.

● నకిలీ పౌడర్లతో జర భద్రం

బిర్యానీ తయారీకి ధనియాలపొడి, మిరప్పొడి, గరంమసాలా, డాల్డా, నెయ్యి అవసరం. నాణ్యమైనవి వాడాలంటే వ్యాపారులకు గిట్టుబాటు కాదు. అందుకనే నల్లబజారులో అత్యంత తక్కువ ధరకు లభించే నకిలీ పౌడర్లను వాడేస్తున్నారు. పైగా బయటి ప్రాంతాల నుంచి తక్కువ ధరకు తెచ్చిన చికెన్, మటన్, చేపలు, రొయ్యలను నిల్వ ఉంచి బిర్యానీలో వాడటం వల్ల సహజత్వాన్ని కోల్పోయి విషంగా మారుతున్నాయి. అందుకే బిర్యానీ తిన్న కొందరిలో అజీర్తి, గ్యాస్, ఫుడ్‌పాయిజన్ సమస్యలు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఈ ఆహారం మహిళల్లో హార్మోన్ల సమస్యకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, బిర్యానీ ఆకర్షణీయంగా ఉండేందుకు ఎల్లో, రెడ్, ఆరెంజ్ రంగులతో కూడిన రసాయానాలు కలుపుతున్నారు. వీటి వల్ల కేన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ప్రజల్లో మార్పు రావాలి

ఆహార తయారీ కేంద్రాలపై దాడులు చేసి అక్కడ నెలకొన్న ప్రజారోగ్య సమస్యలు గుర్తించి నిర్వాహకులను హెచ్చరిస్తున్నాము. ప్రజల్లోనూ అవగాహన రావాలి. రంగులు కలపడం, నిల్వ మాంసం వాడటం, నూనె వరుసగా కాయడం చాలా ప్రమాదకరం. నరాల బలహీనత, మెదడుపై అనారోగ్య తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అజినోమోటో ఉప్పును పూర్తిగా వాడకపోవడం మంచిది.

- వెంకటేశ్వరరావు, సహాయ ఫుడ్ కంట్రోలర్



బయట వంటకాలకు దూరంగా ఉండాలి

నిల్వ మాంసం, రంగులు, చైనా ఉప్పు వంటి వాటివల్ల హార్మోన్ల సమస్య, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులకు దారితీస్తుంది. బయట వంటకాలకు దూరంగా ఉంటే మంచిది. అజినోమోటో వల్ల నరాలు బలహీనపడతాయి. చిన్నారుల్లో మెదడు సంబంధిత వ్యాధులు సంభవిస్తాయి.

- కృష్ణచరిత, ప్రముఖ గైనకాలజిస్టు



అవగాహన లేకపోవడం ప్రధానం

బిర్యానీ ఇప్పుడు అందరికీ ఇష్టమైన ప్రధాన ఆహార పదార్థమైంది. చిన్నారులకు ఇదంటే మక్కువ పెరిగింది. ఇందులో విషపూరిత పదార్థాల కలయిక ఉందని ప్రజలకు అవగాహన లేకపోవడమే ప్రధాన సమస్య ఇంట్లో వంటల కంటే హోటళ్లు, రెస్టారెంట్లు, ఫుడ్‌కోర్టుల్లో లభించి రుచికోసం అందరు తాపత్రయపడుతున్నారు. దీనివల్లే జబ్బులు వస్తున్నాయి.

- ఇరువూరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు

మందుబాబులు


ఫుల్ ఖుషీ

- క్వార్టర్ బాటిల్ రూ.99లకే!
- షాపులలో ఎమ్మార్పీ విక్రయాలు.. బార్లలో రేట్ల తగ్గింపు
- అందుబాటులోకి అన్ని బ్రాండ్లు




రూ.99లకే దొరుకుతున్న క్వార్టర్ బాటిల్

నెల్లూరు (క్రైం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మందుబాబు భలే ఖుషీ అవుతున్నారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో నాసిరకం మద్యానికి తోడు ధరలతో మద్యంప్రియులు అల్లాడిపోయారు. బార్లలో మాత్రం అన్ని బ్రాండ్ల మద్యం దొరికేది. అయితే, ఎమ్మార్పీపై రూ.100 నుంచి 150 వరకు అదనంగా వసూలు చేసేవారు. గడిచిన ఐదేళ్లలో ఇటు మద్యం దుకాణాలు, అటు బార్లలో వైసీపీ సర్కారు మందుబాబుల నుంచి నిలువుదోపిడీ చేసింది. ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పాత మద్యం బ్రాండ్లు అందుబాటులోకి తెస్తామని, మద్యం పాలసీలో మార్పులు చేస్తామని ప్రచారంలో పదే పదే చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు నూతన మద్యం పాలసీను ఈ నెల 16వ తేదీ నుంచి అందుబాటులోకి తెచ్చి, లాటరీ ద్వారా వ్యాపారులకు షాపులు కేటాయించారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ.99లకే క్వార్టర్ మద్యం అందుబాటులోకి వచ్చింది. ధర తక్కువగా ఉన్నా వీఎస్‌ఓపీ కంపెనీ మద్యం కావడంతో మందుబాబులు ఇష్టంగా తాగుతున్నారు. ఇక ఎంసీ, ఐబీ, రాయల్‌స్టాక్ బ్రాండ్‌లు అందుబాటులోకి వచ్చాయి. అయితే మద్యం ధరలు తగ్గుతాయని ఆశించిన ప్రజలకు మాత్రం నిరాస మిగిలింది. ఈ అంశంపై అధికారులను వివరణ కోరగా నవంబరు 1వ తేదీకల్లా కొత్త ధరలు అమలులోకి రానున్నట్లు చెప్పారు.



ధర తగ్గింపుపై ఓ బార్‌లో ఏర్పాటు చేసిన బోర్డు



● బార్లలో ధరల తగ్గింపు

నూతన పాలసీ పుణ్యమా అని బార్లలోనూ మద్యం ధరలు దిగొచ్చాయి. గతంలో బార్లలో

- మిగతా 6లో

భూ ప్రక్షాళనకు గ్రామసభలు మొదలు



జొన్నవాడలో అర్జీ స్వీకరిస్తున్న సర్వే శాఖ ఏడీ నాగశేఖర్

నెల్లూరు (హరనాథపురం) : గత ప్రభుత్వంలో జరిగిన భూముల రీ సర్వేలో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చేందుకు, బాధితుల నుంచి అర్జీలు స్వీకరించేందుకు శనివారం జిల్లావ్యాప్తంగా గ్రామసభలు ప్రారంభమయ్యాయి. జిల్లాస్థాయి అధికారులు మొదలు గ్రామస్థాయి అధికారుల వరకు సభల్లో పాల్గొని అర్జీలు స్వీకరించారు. తొలిరోజు ఆత్మకూరు, కావలి, నెల్లూరు, కందుకూరు మండలాల్లోని 21 గ్రామాల్లో ఈ గ్రామసభలు నిర్వహించారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో జరిగిన సభలో భూ రికార్డులు-సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగశేఖర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వచ్చిన అర్జీలను వచ్చినట్లు అధికారులు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

- వివరాలు 8లో..



ఇండోర్ స్టేడియం పరిశీలనలో రవినాయుడు, బీద రవిచంద్ర తదితరులు

నిబద్ధతతో పని చేయండి

జిల్లాలో క్రీడాభివృద్ధికి నిబద్ధతతో పని చేయండి. సమస్యలపై అధ్యయనం చేయడంతోపాటు ఎప్పటికప్పుడు నివేదికలను సిద్ధం చేసి మాకు పంపండి. అంతేగాక క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ప్రతి మూడు నెలలకోసారి స్థానిక ప్రజాప్రతినిధులతో సమీక్షించండి. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని ఇండోర్ మైదానం, ఇతర మైదానాల మరమ్మతులు చేపట్టడంతోపాటు అకాడమీలను వినియోగంలోకి వినియోగంలోకి తెచ్చేందుకు ప్రణాళికలు చేస్తున్నాం.'

- నెల్లూరులో జరిగిన శాప్ అధికారుల సమీక్షలో చైర్మన్ రవినాయుడు

- వివరాలు 6లో..



కుర్రపల్లి వద్ద దున్నపోతుల వాగు ఉధృతి

మెట్టలో భారీ వర్షం

పొంగి ప్రవహించిన వాగులు, వంకలు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉరుములు, మెరుపులతో మెట్టప్రాంతం దద్దరిల్లిపోయింది. శనివారం ఉదయం నుంచే భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం అయ్యాయి. 112.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉదయగిరిలో వీధులు వాగుల్లా మారాయి. మురికి కాలువలు పొంగి పొర్లడంతో చెత్తాచెదారం రోడ్లపై చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ బస్టాండ్ చెరువును తలపించింది. దున్నపోతుల, పిల్లాపేరు వాగులు ఉధృతంగా ప్రవహించాయి. పుల్లాయపల్లి గ్రామం వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో కొండకింద గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. దాసరిపల్లి గ్రామ పెద్ద చెరువు సప్లయ్ చానెల్‌కు గండిపడడంతో నీరు నివాసాల్లోకి చేరింది. విషయం తెలుసుకొన్న మాజీ సర్పంచ్ సయ్యద్ జమృత్ జాఫర్ మొహిద్దీన్ ఎక్స్‌కవేటర్ సహాయంతో గండిని పూడ్చడంతో ప్రమాదం తప్పింది. ఇక గండిపాళెం జలాశయానికి 4 అడుగుల మేర నీరు చేరింది. వింజమూరులో

- మిగతా 6లో

డిప్ పద్ధతిలోనే ఇసుక టెండర్లు

- అక్రమార్కులకు కళ్లెం వేసే వ్యూహం
- రవాణా ధర స్థిరీకరణ
- ఒకటీ రెండు రోజుల్లో జీవో?

నెల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రీచ్ నుంచి స్టాక్ పాయింట్‌కు ఇసుక రవాణా టెండర్లలో అక్రమార్కుల రంగ ప్రవేశాన్ని కట్టడి చేయడానికి డిప్ పద్ధతిలో టెండర్లు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో ఇసుక కాంట్రాక్టులతో కోట్లు కొల్లగొట్టిన గుత్తేదారులు, రాజకీయ పార్టీ నాయకులు ప్రస్తుతం ఇసుక టెండర్లలో చొరబడి దోచుకోవడానికి సిద్ధమయ్యారన్న అనుమానాలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

జిల్లాలో నాలుగు ఇసుక రీచ్‌లకు ఇటీవల టెండర్లు పిలిచారు. ఇసుకను స్టాక్ పాయింట్ వద్దకు రవాణా చేయడానికి టన్నుకు రూ. 115 ధర నిర్ణయించారు. ఈ టెండర్లలో 40 మందికిపైగా పాల్గొన్నారు. వారిలో కొద్ది మంది మాత్రమే ప్రభుత్వం నిర్ణయించిన రూ. 115 కన్నా అధిక ధర కోట్ చేశారు. అత్యధికులు భారీ లెస్‌తో టెండర్లు వేశారు. రూ.80కే రవాణా చేస్తామని కొందరు టెండర్లు వేస్తే మరి కొందరు కేవలం 30 నుంచి 36 లకే సప్లయ్ చేస్తామని దరఖాస్తు చేశారు. ఈ ధరలను చూసిన కలెక్టర్ ఓ ఆనంద్ ఖంగుతిని విషయాన్ని మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితిని గమనించిన నారాయణ దొడ్డిదారిన ఇసుకను విక్రయించుకోవాలనే ఉద్దేశంతోనే భారీ లెస్‌కు టెండర్లు వేశారన్న విషయం అర్థం చేసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమార్కులకు అవకాశం కల్పించకూడదనే ఉద్దేశంతో మైనింగ్ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు టెండర్లలో జరుగుతున్న బాగోతాన్ని వివరించారు. దీనికి పరిష్కార మార్గంగా ప్రభుత్వం నిర్ణయించిన రూ.115లకే ధర స్థిరీకరించి టెండర్లలో పాల్గొన్నవారిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ఉన్నతాధికారులు ఇది మంచి పరిష్కారం అని భావించి అలాగే చేయమని మౌఖికంగా ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం నెల్లూరు జిల్లాలో ఇసుక టెండర్లు వేసిన అందరినీ చేర్చి డిప్ పద్ధతిలో నలుగురిని ఎంపిక చేసి వారికి కాంట్రాక్టు అప్పగించారు. అయితే డిప్ విధానంపై జీవో లేని పక్షంలో న్యాయపరమైన సమస్యలు, విమర్శలు ఎక్కువ అవుతాయనే ఉద్దేశంతో నెల్లూరు జిల్లాలో డిప్ పద్ధతిన కేటాయించిన కాంట్రాక్టులను రద్దు చేశారు. ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరను స్థిరీకరిస్తూ టెండర్లను డిప్ పద్ధతిలో ఖరారు చేసే విధంగా జీవో విడుదల చేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇసుక టెండర్లలో అక్రమార్కుల ప్రవేశాన్ని నియంత్రించి ప్రజలకు అతి తక్కువ ధరకు ఇసుక లభ్యం అయ్యేలా పకడ్బందీగా చట్టం తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సంబంధిత శాఖ ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

72 ఏళ్ల క్రితం స్వర్ణం ధర ఎంతో తెలుసా!?

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : బంగారం అంటే ఇష్టం ఉండని వారుండరు. మగువలకైతే మహా ప్రీతి. అలాంటి స్వర్ణం ఇప్పుడు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరిపోయింది. ఒక గ్రాము పసిడి ధర రూ.7వేలకు పైగానే ఉంది. ఇది మరింత పెరిగే అవకాశమూ ఉందని నిపుణులు అంటున్నారు. మరి పదేళ్ల క్రితం ఇదే బంగారం ధర ఎంత ఉండేదో మీకు తెలుసా!? 1952లో ధర ఇంకెంత ఉండేదో తెలుసా!?. ఆ వివరాలు పట్టిక రూపంలో ఆంధ్రజ్యోతి అందిస్తోంది.. ఓ లుక్కేయండి!

పది గ్రాముల బంగారం ధర (రూ.లలో)

సంవత్సరం	ధర
1952	26
1953	73
1954	77
1955	79
1956	90
1957	90
1958	95
1959	102
1960	111
1961	119
1962	119
1963	97
1964	63
1965	72
1966	84
1967	102
1968	168
1969	176
1970	170
1971	190
1972	202
1973	278
1974	506
1975	540
1976	432
1977	486
1978	685
1979	937
1980	1,330
1981	1,800
1982	1,645
1983	1,800
1984	1,970
1985	2,130
1986	2,140
1987	2,570
1988	3,130
1989	3140
1990	3,200
1991	3,466
1992	4,334
1993	4,140
1994	4,598
1995	4,680
1996	5,160
1997	4,725
1998	4,045
1999	4,234
2000	4,400
2001	4,300
2002	4,990
2003	5,600
2004	5,850
2005	7,000
2006	8,400
2007	10,800
2008	12,500
2009	14,500
2010	18,500
2011	26,400
2012	31,050
2013	29,600
2014	29,600
2015	26,343
2016	28,673
2017	29,667
2018	34,438
2019	35,220
2020	48,651
2021	50,045
2022	52,950
2023	60,300
2024	74,510



ఊటీ కాదు.. ఉదయగిరే..!



ఉదయగిరి దుర్గం కొండలను కమ్మేసిన మేఘాలు



కనువిందు చేస్తున్న జలపాతం

వర్షాలతో ఉదయగిరి దుర్గం కొండలు పచ్చగా కనువిందు చేస్తున్నాయి. శనివారం కుండపోత వర్షం కురవడంతో దుర్గంపై ఉన్న సల్మాపేట్ జలపాతం దుముకుతోంది. అడవుల్లో సెలయేళ్లు గలగల పారుతుండటంతో ప్రకృతి రమణీయతకు అద్దం పడుతున్నాయి. దుర్గం కొండలను మేఘాలు కమ్మేసిన దృశ్యాలు చూపరులను కనువిందు చేశాయి. పచ్చటి అందాలను తిలకించేందుకు ప్రజలు తరలివస్తున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా సెలయేళ్లలో స్నానమాచరిస్తూ ఉల్లాసంగా గడుపుతున్నారు.

- ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి)

మెట్టలో భారీ వర్షం

(5వ పేజీ తరువాయి)

నీటమునిగిన లోతట్టు ప్రాంతాలను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పరిశీలించారు. నెల్లూరు నగరంతో పాటు మనుబోలు, రాపూరు, వరికుంటపాడు, సీతారామపురం, దుత్తలూరు, కలిగిరి, లింగసముద్రం తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది.

● 'సోమశిల'కు ఇన్‌ఫ్లో

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి శనివరం 32,116 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. డ్యాంలో 58.644 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 40 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. రాళ్లపాడు రిజర్వాయర్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది.

22న జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22వ తేదీన జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి ఎం వినయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్లిప్‌కార్ట్ సంస్థలో కావలిలో పనిచేసేందుకు 20 డెలివరీ అసోసియేట్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఇనోవ్‌సూర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో టెలికాలర్స్, టీమ్‌లీడర్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ 30 పోస్టులకు, అపోలో ఫార్మసీలో ఫార్మా ట్రైనీస్, ఫార్మసిస్ట్ 25 పోస్టులకు ఎంపికలు జరుగుతాయని తెలిపారు. అమర్‌రాజా బ్యాటరీస్‌లో మిషన్ ఆపరేటర్ 200 పోస్టులకు ఎంపికలు జరుగుతాయని పేర్కొన్నారు. క్రెడిట్ ఆక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్‌లో 20 ఫీల్డ్ ఆఫీసర్ పోస్టులకు, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో ఇంటర్న్‌షిప్ పీవో 30 పోస్టులకు ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఎన్‌ఏసీ కావలి, నెల్లూరులోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో ఉదయం 10.30 గంటలకు జాబ్‌మేళా జరుగుతుందని తెలిపారు.

మందుబాబులు ఫుల్ ఖుషీ

(5వ పేజీ తరువాయి)

మద్యం పార్శిల్ తీసుకోవాలంటే ఎమ్మార్పీపై రూ.70, నాన్‌ఏసీలో కూర్చొని మద్యం సేవించాలంటే రూ.100, ఏసీలో రూ.330 నుంచి 400 వరకు అదనంగా వసూలు చేసేవారు. ఇప్పుడు ప్రైవేటు షాపుల్లో అన్ని బ్రాండ్లు దొరుకుతుండటంతో మద్యంప్రియులు బార్లకు వెళ్లడం తగ్గించేశారు. దీంతో బార్ల యజమానులు ఎమ్మార్పీపై రూ.20 అధికం అంటూ ఆఫర్ పెట్టారు.

క్రీడాభివృద్ధికి నిబద్ధతతో పనిచేయండి

● సమస్యలపై ఎప్పటికప్పుడు నివేదికలు పంపండి
● నెలకోసారి ప్రజాప్రతినిధులతో సమీక్షించాలి
● శాప్ అధికారులకు చైర్మన్ ఆదేశం



నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవి నాయుడు

నెల్లూరు(విద్య), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) 19 : జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు, సిబ్బంది జిల్లాలో క్రీడాభివృద్ధికి నిబద్ధతతో పని చేయాలని ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు సూచించారు. శనివారం నెల్లూరు రూరల్ మండలం మొగళ్లపాళెం మల్టీపర్పస్ ఇండోర్ క్రీడామైదానాన్ని, నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను ఆయన సందర్శించారు. అనంతరం స్టేడియంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన అధికారుల, సిబ్బంది సమీక్షలో చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న సమస్యలపై అధ్యయనం చేయడంతోపాటు ఎప్పటికప్పుడు నివేదికలను సిద్ధం చేసి తమకు అందించాలన్నారు. క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ప్రతి మూడు నెలలకోసారి స్థానిక ప్రజాప్రతినిధులతో సమీక్షించాలని సూచించారు. ఈ సమీక్షలో జిల్లా క్రీడాప్రాధికారసంస్థ అధికారి ఆర్‌కె.యతిరాజ్, టీడీపీ నాయకులు గిరిధర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కాకర్ల తిరుమలనాయుడు, క్రీడాసంఘాల ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

● 2 వారాల్లో స్టేడియం ప్రారంభం

మొగళ్లపాళెంలో 150 ఎకరాల స్థలంలో క్రీడామైదానాల నిర్మాణం రూ. 80 శాతం పూర్తి అయ్యాయని రవినాయుడు అన్నారు. పెండింగ్ పనులతోపాటు పైప్ లైన్స్‌కు అవసరమైన మరో రూ.10లక్షలు విడుదల చేయించి రెండు వారాల్లో ఇండోర్ స్టేడియం ప్రారంభించనున్నట్లు చెప్పారు. అలాగే ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని ఇండోర్ మైదానం, ఇతర మైదానాల మరమ్మతులు చేపట్టడంతోపాటు అకాడమీలను వినియోగంలోకి వినియోగంలోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కేవీకేలు, ఇండోర్ మైదానాలను సిద్ధం చేయడంతోపాటు డీఎస్‌ఏల పనితీరుపై దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. క్రీడారంగం ఉన్నతికి అన్ని వర్గాల వారు పూర్తి సహకారం అందించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం క్రీడారంగాన్ని పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. నెల్లూరులోని క్రీడామైదానాలన్నీ సిద్ధం చేసి వినియోగంలోకి తేవాలని కోరారు.

హాస్టళ్ల మరమ్మతులకు రూ.10 కోట్లతో నివేదిక

● అనుమతులు రాగానే పనులు పూర్తి చేస్తాం
● 'ఆంధ్రజ్యోతి'తో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 19 : జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు రూ.10.16 కోట్లతో నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపినట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఎఫ్‌ఏసీ) బి.శ్రీనివాసులు తెలిపారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 71 హాస్టళ్లు ఉండగా, 65 ప్రభుత్వ భవనాల్లోను, ఐదు ప్రైవేటు భవనాల్లో నడుస్తు న్నాయన్నారు. ప్రభుత్వ భవంతులలో ఉన్న కొన్ని హాస్టళ్లకు శ్లాబు, గచ్చు, కిటికీలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఇంకొన్ని చోట్ల మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని నివేదిక తయారు చేసి పంపినట్లు చెప్పారు. అనుమతులు రాగానే మరమ్మతు పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

● డీఎస్సీకి ఉచిత శిక్షణ

డీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్న నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నట్లు శ్రీనివాసులు తెలిపారు. మూడు నెలలపాటు ఈ శిక్షణ ఉంటుందని, శిక్షణలో ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేయబడిన కోచింగ్ సెంటర్లలో శిక్షణ ఇప్పించనున్నట్లు వెల్లడించారు. డీఎడ్, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు టెట్ అర్హత సాధించి ఉండాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.5 లక్షలలోపు ఉండాలని, ఈ నెల 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలని తెలిపారు.


ఈ కవలలు వరల్డ్ రికార్డ్



కావలికి చెందిన తోషణ్, తోషిణి (9నెలల కవలలు) లకు ఇంటర్‌నేషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో స్థానం లభించింది. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి కిడ్స్ టాలెంట్ పోటీల్లో (బేబీ ఒలింపిక్స్) వీరు ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి, సూపర్ టాలెంటెడ్ కిడ్స్‌గా ఎంపికయ్యారు. ఈ క్రమంలో వారు ఇంటర్‌నేషనల్ బుక్‌ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. పట్టణంలోని ప్రైవేట్ ఉద్యోగి సిద్ధార్థ్ మణికంఠ, రూపశ్రీ దంపతుల పిల్లలు వీరు. ఈ సందర్భంగా మణికంఠ మాట్లాడుతూ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సైట్‌లో వివరాలు అప్‌లోడ్ చేశామని తెలిపారు. క్రియేట్ రికార్డ్ కింద తోషన్, తోషిణీల పేర్లు నమోదైనట్లు శనివారం సైట్‌లో ప్రకటించగా, సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నామన్నారు. మరో 20రోజుల్లో మెడల్స్, సర్టిఫికెట్లు పంపించనున్నట్లు సమాచారం అందిందన్నారు.

- కావలి టౌన్, (ఆంధ్రజ్యోతి)

C.R.I.M.E D.A.I.R.Y



మృతులు కృష్ణారావు, సునీత (ఫైల్)

2022, ఆగస్టు 28వ తేదీ తెల్లవారుజాము...

నెల్లూరు నగర పరిధి పొదారుపల్లిలోని అశోక్‌నగర్‌లో ఓ ఇంటిలో పాలు పోసేందుకు వెళ్లిన మహిళకు ప్రధాన ద్వారం ముందే రక్తపు మడుగులో ఓ మృతదేహం కనిపించింది. అంతే, ఒక్కసారిగా గుండె ఆగిపోయినట్టు అయ్యింది. బిగ్గరగా కేకలు వేస్తూ బయటకు పరుగులు తీసింది. ఆమె కేకలు విన్న చుట్టుపక్కల వాళ్లు హడావిడిగా అక్కడకు చేరుకున్నారు. నిన్నటివరకు కలివిడిగా మాట్లాడిన వ్యక్తి రక్తపుమడుగులో ఉండటాన్ని చూసి కంటతడి పెట్టుకున్నారు.

సమాచారం అందుకున్న వేదాయపాళెం పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. అక్కడ జరిగింది ఒక హత్య కాదు.. రెండు. భర్తతోపాటు భార్యనూ కిరాతకంగా కడతేర్చారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకోవడం కోసం నానా తిప్పలు పడ్డారు. ఇతర రాష్ట్రాలకు చెందిన దారి దోపిడీ గ్యాంగ్ ఈ ఘాతుకానికి పాల్పడిందా!? ఆర్థిక లావాదేవీల గొడవలు ఏమైనా ఉన్నాయా!? రాజకీయ కక్షలు కూడా ఉన్నాయా!? ఇలా అనేక అనుమానాలు పోలీసులను చుట్టేశాయి. చివరకు వేలిముద్రలే నిందితులను పట్టించాయి. అదెలాగో ఈ కథనం చదవండి..

ఆ కేసును ఎప్పటికీ మరువలేం



జంట హత్యలు జరిగిన సమయంలో నేను నగర డీఎస్పీగా ఉన్నా. సహజంగా అంత కిరాతకంగా హత్య చేసింది ఎవరన్న కోణంలో విచారణ సాగించాం. సాధారణంగా హత్య చేసిన వారు పోలీసులకు దూరంగా ఉండాలని అను కుంటారు. అయితే ఈ కేసులో మాత్రం నిందితుడు శివకుమార్ ఎక్కడికీ పారిపోకుండా హత్య జరిగిన ప్రాంతంలో అందరితో కలిసి బాధపడుతూ, మార్చురీ వద్దకు వెళ్లడం, అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. దీంతో ఎవరికీ అనుమానం రాలేదు. అయితే సాంకేతిక పరిజ్ఞానం అతడ్ని పట్టించింది. ఇలాంటి కేసులను ఎప్పటికీ మరువలేం.

- అబ్దుల్ సుబాన్

● సంచలనం రేపిన దంపతుల హత్య కేసుకు రెండేళ్లు!
● డబ్బుపై వ్యామోహంతోనే ఘటన ● హోటల్‌లో పని చేసే వ్యక్తే సూత్రధారి
● నిందితులను పట్టించిన వేలిముద్రలు

నమ్మకస్తుడే గొంతు కోశాడు!

పడారుపల్లి అశోక్‌నగర్‌లో ఉంటున్న కృష్ణారావు క్యాటరింగ్‌తోపాటు ఓ హోటల్ నడుపుతున్నారు. ఈయన ఇద్దరు సంతానంలో పెద్ద కుమారుడు సాయిచంద్ విశాఖలో ఉద్యోగం చేస్తూ అక్కడే స్థిరపడ్డాడు. రెండోకుమారుడు గోపిచంద్ రాంజీ నగర్‌లో ఉంటూ పొగతోటలో ఓ హోటల్ నడుపుతున్నారు. కృష్ణారావు పడారుపల్లి అశోక్ నగర్‌లో ఓ ఇల్లు నిర్మించుకుని ఆరేళ్లుగా భార్య సునీతతో కలిసి ఉంటున్నాడు. ఆగస్టు 27వ తేదీ రాత్రి హోటల్ లావాదేవీలు ముగించుకుని 11.30 గంటల ప్రాంతంలో ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే ఇంటి వద్ద ఉన్న దుండగులు కృష్ణారావును వరండాలోనే అడ్డుకుని కత్తితో గొంతు కోసి హతమార్చారు. ఆ తర్వాత ఇంటిలో నిద్రిస్తున్న భార్య సునీతను హత్య చేసి, దొరికిన నగదుతో పరారయ్యారు. మరోసటి రోజు ఉదయం పాలు పోసేందుకు వెళ్లిన రమణమ్మ గుమ్మం వద్దే రక్తపుమడుగులో ఉన్న కృష్ణారావును చూసి భయంతో కేకలు వేస్తూ వీధిలోకి పరుగులు తీసింది. స్థానికులు వేదాయపాలెం పోలీసులకు సమాచారం అందించారు. కుమారుడు వాసిరెడ్డి గోపిచంద్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

● నిందితుల కోసం ముమ్మర గాలింపు..

దంపతుల హత్య నగరంలో పెద్ద సంచలనమైంది. దీనిని ఛాలెంజ్‌గా తీసుకున్న అప్పటి ఎస్పీ సీహెచ్ విజయరావు నిందితుల కోసం అదనపు ఎస్పీ (క్రైం) చౌడేశ్వరి ఆధ్వర్యంలో నగర ఇన్‌చార్జి డీఎస్పీ, సీసీఎస్ డీఎస్పీలు, పలువురు సీఐలు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. దోపిడీ దొంగల పనై ఉంటుందా!? అని అనుమానం ఉన్న ప్రాంతాలన్నీ జల్లెడ పట్టారు. చివరకు కృష్ణారావు నడుపుతున్న శ్రీరామ క్యాంటీన్‌లో పనిచేసే సిబ్బందిని పిలిపించి విచారించారు. అయితే, అక్కడ పనిచేస్తున్న మన్నూరు శివకుమార్ మాత్రం విచారణకు రాలేదు. దీంతో ఆయనపై పోలీసులకు అనుమానం వచ్చింది. రామకోటయ్య నగర్‌లో శివకుమార్ ఉంటున్న గది వద్ద పోలీసులు నిఘా ఉంచారు. అదే నెల 31వ తేదీ మధ్యాహ్నం వేదాయపాలెం ఇన్‌స్పెక్టర్ నరసింహరావు తన సిబ్బందితో కలిసి శివకుమార్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. ఇంకేముంది అసలేం జరిగిందో పూసగుచ్చినట్టు వివరించాడు శివకుమార్.

● నమ్మకంగా ఉంటూనే..

కృష్ణారావుకు చెందిన హోటల్‌లో శివకుమార్ కొన్నేళ్లుగా నమ్మకంగా పని చేస్తున్నాడు. అయితే, డబ్బుపై వ్యామోహంతో కృష్ణారావు ఇంట్లో రూ.10-15 లక్షల వరకు నగదు ఉంటుందని ఆ నగదు చోరీ చేస్తే జీవితం స్థిరపడిపోతుందని భావించాడు. ఇంకేముంది తన సమీప బంధువైన సైదాపురం మండలం ఊటుకూరుకు చెందిన కాలగందల రామకృష్ణకు విషయం చెప్పి నెల్లూరుకు రావాలని సూచించాడు. కృష్ణారావు ఇంటి తాళాలను డూప్లికేట్ చేయించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనం చేయాలని ముందుగా స్కెచ్ వేశారు. అది వీలుకాలేదు. 27వ తేదీ రాత్రి శివకుమార్, రామకృష్ణలు కృష్ణారావు ఇంటికి చేరుకుని, మాటు వేశారు. సరిగ్గా 11.30-12 గంటల ప్రాంతంలో కృష్ణారావు గేటు తీసి లోపలికి వస్తుండగా తలపై బలంగా కొట్టారు. కిందపడిపోయిన కృష్ణారావు గొంతును కిరాతకంగా పెన్ కత్తితో కోసి, హతమార్చారు. ఆ తర్వాత ఇంట్లోకి ప్రవేశించి, బెడ్‌రూములో నిద్రపోతున్న మృతుడు భార్య సునీతను కర్రతో బలంగా కొట్టి హత్య చేశారు. ఇళ్లంతా గాలించి దొరికిన డబ్బు తీసుకుని శివకుమార్ గదికి చేరుకున్నారు. దోచుకున్న నగదులో శివకుమార్ రూ.70వేలు, రామకృష్ణ రూ.90 వేలు పంచుకున్నారు.



నిందితులను అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న నాటి ఎస్పీ విజయరావు (ఫైల్)

● వేలిముద్రలే పట్టించాయి!

ప్రధాన నిందితుడు శివకుమార్ ఎక్కడికీ పారిపోకుండా హత్య జరిగిన ప్రాంతానికి అందరితో కలిసి వచ్చాడు. మృతుడి సొంత జిల్లా ఎన్టీఆర్ జిల్లాలో జరిగిన అంత్యక్రియల్లోనూ పాల్గొన్నాడు. దీంతో ఎవరికీ శివకుమార్‌పై అనుమానం రాలేదు. అయితే వేలి ముద్రల సేకరణకు, పోలీసుల విచారణకు రాకపోవడమే శివకుమార్‌ను పట్టించింది. హత్య కేసును ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు.

- నెల్లూరు (క్రైం)

● ఇలాగైతే డెంగ్యూ రాదా?



కొబ్బరి నీళ్లు తాగేసిన తర్వాత ఖాళీ బోండాలను అలాగే పడేస్తే వాటిలో వర్షపు నీరు చేరి డెంగ్యూ కారక దోమల ఉత్పత్తికి కేంద్రాలుగా మారుతాయని, ఖాళీ బోండాలను అలాగే వదిలేయొద్దని అధికారులు మొత్తుకుంటున్నా ప్రజలు, వ్యాపారుల్లో మార్పు రావడం లేదు. నెల్లూరు - కోడూరు రహదారి వెంబడి అల్లీపురం వద్ద ఖాళీ కొబ్బరి బోండాల గుట్టలు పేరుకుంటున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ బోండాల్లో నీరు చేరి దోమల ఉత్పత్తికి హేతువవుతున్నాయి. మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసానికి కూతవేటు దూరాన, అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీపాన పెద్ద మొత్తంలో బోండాలు పోసిఉన్నారు. నిత్యం అధికారులు, వైద్యులు ఈ మార్గంలోనే తిరుగుతున్నా వీటిని పట్టించుకోకపోవడం గమనార్హం.

- నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి)



బస్సెక్కితే బహుమతి

నెల్లూరు నుంచి బుచ్చి రూట్‌లో నడిచే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి ఆర్టీసీ అధికారులు గిఫ్ట్ స్కీమ్‌ను అమలు చేస్తున్నారు. ఇందుకోసం బస్సులో ఒక డబ్బా ఏర్పాటు చేశారు. బస్సు దిగేముందు టికెట్ వెనుక ఫోన్ నెంబరు రాసి ఆ డబ్బాలో వేయాలి. ప్రతి 15 రోజులకు ఒకసారి ఆ టికెట్ల నుంచి లక్కీ డిప్ ద్వారా ముగ్గురు విజేతలను ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేస్తున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ నెల్లూరు 1వ డిపో మేనేజర్ మురళీకృష్ణ శనివారం లక్కీ డిప్ ద్వారా విజేతలను ఎంపిక చేశారు. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన జీ ప్రహర్షిణి, హెచ్ వెంకటేశ్వర్లు, చెన్నైకు చెందిన సచింద్రారెడ్డి బహుమతులు అందుకున్నారు.

- నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట (ఆంధ్రజ్యోతి)



పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న భవనం

నాటి కళ ఏది?

సామాజిక వికాసం కోసం నిర్మించిన భవనాలు వికాసాన్ని కోల్పోయాయి. ఒకప్పుడు కళకళలాడుతున్న పొదలకూరు పట్టణంలోని బీసీ భవన్ (మహాత్మా జ్యోతిరావుపూలే), ఎస్సీ భవన్ (బాబు జగ్జీవన్‌రామ్)లు కళావిహీనంగా మారాయి. ఆయా సామాజిక వర్గాల కోసం 2011లో ఈ భవనాలను నిర్మించారు. కొన్ని ఏళ్లపాటు సేవా, సాంస్కృతిక, వివిధ రాజకీయ, సామాజిక కార్యక్రమాలకు వేదికగా మారాయి. బీసీ సంక్షేమ సంఘం, ఎస్సీ సంఘాల నాయకులు ఈ భవనాల్లోనే జ్యోతి రావుపూలే, బాబు జగజ్జీవన్‌రామ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించేవారు. అలాంటి ఈ భవనాల ఆలనాపాలన లేక ప్రస్తుతం పిచ్చి మొక్కలతో సగం విరిగిన కిటికీలు, తలుపులు, గేట్లతో వికాసాన్ని కోల్పోయి దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా సామాజిక వర్గాల నాయకులు చొరవ చూపి ఈ సామాజిక వికాస భవనాలకు పూర్వ వైభవం తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

- పొదలకూరు (ఆంధ్రజ్యోతి)



బాబు జగజ్జీవన్‌రామ్ భవనంలో ధ్వంసమైన తలుపు

ఆత్మకూరులో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక

● అవసరాలకు ఉచితంగా ఇసుక తోలుకోవచ్చు

● దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఆనం నారాయణరెడ్డి

అనంతసాగరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): త్వరలో ఆత్మకూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుచేసి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళిక చేస్తున్నట్లు దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరులోని కార్యాలయంలో అనంతసాగరం, మర్రిపాడు మండలాల ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ సభ్యత్వ నమోదుపై నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఆలయాల మరమ్మతులకు రూ. 5 లక్షల నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. సీసీ రోడ్లు, తాగునీటి వసతి, మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు.

● అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టండి

ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు మంత్రి ఆనం స్పష్టం చేశారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు ఉన్నవారు వ్యక్తిగత అవసరాలకు ఉచితంగా ఇసుకను తీసుకెళ్లవచ్చని, ఏ అధికారి అడ్డుకోరని.. ఎవరైనా అడ్డుకుంటే వారిని సస్పెండ్ చేసేలా ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారన్నారు. గ్రామాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై నాయకులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎన్‌డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, తాళూరి గిరినాయుడు, మండల అధ్యక్షురాలు మునగపాటి సునీత, మెట్టుకూరు కృష్ణారెడ్డి, ఆరికట్ల జనార్ధన్‌నాయుడు, శాఖమూరి నారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని విత్తన తయారీ కేంద్రాల సీజ్



అనుమతులు లేని విత్తన తయారీ కేంద్రాన్ని సీజ్ చేసిన అధికారులు

అల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అల్లూరులో వరి విత్తన తయారీ కేంద్రాలు, విత్తన విక్రయ కేంద్రాలతో మాఫియా నడుస్తోంది. ఈ వ్యవహారంపై విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు చేసిన విషయం విదితమే. అయితే దాడులు చేసిన కేంద్రాలను శనివారం కావలి ఏడీఏ నాగరాజు ఆధ్వర్యంలో అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ అనుమతులు లేకుండానే భారీస్థాయిలో వరి విత్తన తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నారని, ఊహించని స్థాయిలో నిల్వ చేసి విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. తద్వారా రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. కాగా నార్త్ మోపూరులో ఓ వాహనంలో విత్తనాలను తరలిస్తుండగా, వారిని విచారించిన ఏడీఏ బృందం ఎక్కడి నుంచి తెస్తున్నారని ప్రశ్నించగా, స్థానికంగా ఒకరి పేరు తెలిపారు. అక్కడికి వెళ్లి చూడగా అధికారులకే విస్తుపోయేలా ధాన్యం నిల్వలు విత్తనాల సంచిలో వేసి విక్రయిస్తున్నారని, దానికి కూడా తాళాలు వేశామని తెలిపారు. కార్యక్రమంలో అల్లూరు వ్యవసాయాధికారి శ్రీహరి, వీఆర్వో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల ఏర్పాటుపై ఘర్షణ

● పగిలిన బీరు సీసాలు ● టీడీపీ నేతల వద్దకు పంచాయితీ

● రాజీ కుదిర్చేయత్నంలో నాయకులు



రుద్రకోట వద్ద మద్యం దుకాణంలో పగిలిపోయిన బీరు సీసాలు

కావలి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతాల వద్ద ఘర్షణలు జరుగుతున్నాయి. కావలి రూరల్ మండలం రుద్ర కోటలో శనివారం మద్యం దుకాణాల ఏర్పాటుపై ఏర్పడిన వివాదం చివరకు పోలీస్ స్టేషన్‌కు చేరింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు, రూరల్ మండలానికి నాలుగు ప్రైవేట్ మద్యం దుకాణాలను కేటాయించారు. వాటిని దక్కించుకున్న వారు దుకాణాల ఏర్పాటు విషయంలో ఘర్షణలకు పాల్పడుతున్నారు. వేలం దక్కించుకున్న వారు మండలంలో ఎక్కడైనా దుకాణం పెట్టుకునే అవకాశం ఉంది. ఎక్కువగా ఆదాయం వచ్చే రుద్రకోట, తుమ్మలపెంటపైనే అందరి దృష్టి పడింది. మద్యం దుకాణాలు దక్కించుకున్న ఓబయ్య, విక్రమ్‌రెడ్డిల మధ్య దుకాణం ఏర్పాటుపై రుద్రకోటలో వివాదం చోటుచేసుకుంది. ఓబయ్య రుద్రకోటలో గతంలో ఉన్న పాత దుకాణం ఉన్న భవనంలో దుకాణం పెట్టుకునేందుకు సిద్ధపడగా, విక్రమ్‌రెడ్డి వర్గం అడ్డుకుంది. దీంతో ఆ పంచాయితీ కొంతమంది టీడీపీ నాయకుల వద్దకు చేరింది. దీంతో మండలంలో మద్యందుకాణాలు దక్కించుకున్న నలుగురిని, వారి అనుచరులను నేతలు పిలిచి, రాజీ మార్గంలో దుకాణాలు ఏర్పాటు చేసుకుందామని, రాజీ కుదిరేవరకు ఎవరూ విక్రయాలు జరపకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అయితే విక్రమ్‌రెడ్డి శుక్రవారం రుద్రకోటలో మరో భవనంలో మద్యం కేసులు దించటంతో వివాదం చోటు చేసుకుంది. దీంతో అభ్యంతరం చెబుతూ ఓబయ్య వర్గం వారు అక్కడకు వెళ్లి వాదనకు దిగారు. ఆ తోపులాటలో ఒకరినొకరు నెట్టుకోవటంతో దుకాణంలో ఉన్న బీరు బాటిళ్ల కేసులలోని సీసాలు కొన్ని పగిలిపోయాయి. దీంతో విక్రమ్‌రెడ్డి ఆగ్రహించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు అక్కడకు వెళ్లి పరిశీలించి, ఎక్సైజ్ సీఐ సుంకర శ్రీనివాసులును అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిబంధనల మేరకు మంజూరైన షాపులు నచ్చిన చోట పెట్టుకోవచ్చని చెప్పటంతో పోలీసులు వెనుతిరిగారు. ఈ క్రమంలో రుద్రకోటలో దుకాణం ఎవరికి దక్కుతుందో వేచిచూడాలి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	140
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	276
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7498
వెండి కిలో ధర	రూ. 99,300
వెండి ఒక గ్రాము	రూ.102.30

మానవ శరీర దృఢంగా ఉండాలంటే బలమైన ఎముకలు, కండరాలు ఎంతో ముఖ్యం. అలాంటి ఎముకలు పటుత్వాన్ని కోల్పోయి పెలుసుబారడమే ఆస్టియోపోరోసిస్ వ్యాధి. ఆధునిక జీవన విధానం పేరుతో శారీరక శ్రమ లేకపోవడం, తీవ్రమైన మానసిక ఒత్తిడి, ఆహారపు అలవాట్ల కారణంగా ఎముకలను బోలుగా మార్చే ఈ వ్యాధికి ఎంతో మంది గురవుతున్నారు. వయసు పెరగడం వల్ల శక్తి సన్నగిల్లడంతో వృద్ధుల్లో కనిపించాల్సిన ఈవ్యాధి ప్రస్తుతం యువతకూ వస్తోంది. ప్రత్యేకించి మహిళలే ఎక్కువ మంది ఈవ్యాధి బారిన పడుతుండటం గమనార్హం. ముఖ్యంగా రుతుక్రమం ఆగిపోయిన మహిళల్లో ఈస్ట్రోజన్ శాతం తగ్గి ఎముకల్లో కాల్షియం క్షీణించి ఆస్టియో పోరోసిస్‌తో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని లేకపోతే మంచానికే పరిమితం చేసి, ప్రాణాపాయానికి కూడా దారితీస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ఎముకలు గుల్ల చేసేస్తుంది

● 'ఆస్టియో పోరోసిస్' వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు

● అప్రమత్తంగా లేకపోతే మంచానికే పరిమితం

● ముఖ్యంగా మహిళలూ తస్మాత్ జాగ్రత్త!

● జిల్లాలో 2.3 లక్షల మంది వ్యాధిగ్రస్థులు

● నేడు ప్రపంచ బోలు ఎముకల వ్యాధి నివారణ దినం

అందుబాటులో ఎన్నో వైద్య విధానాలు



ఆస్టియో పోరోసిస్ వ్యాధి చికిత్సకు ఎన్నో వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. 45 ఏళ్ల పైబడ్డ వారు తప్పనిసరిగా ఎముకల పరీక్ష చేయించుకోవాలి. ఆహార నియమాలు తప్పని సరిగా పాటించాలి. చిన్నతనం నుంచే కాల్షియంతో కూడిన ఆహార పదార్థాలు తీసుకుంటే భవిష్యత్తులో సమస్యలు రావు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న వారికి సూర్యరశ్మి తగలక పోవటం, ఏసీలోనే ఎక్కువ సేపు గడపటం వల్ల కూడా ఆస్టియో పోరోసిస్ బారిన పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ గతంలో లాగా శారీరక శ్రమ తగ్గింది. ఇందువల్ల పల్లె ప్రజలు కూడా ఈ వ్యాధికి ఎక్కువగా గురవుతున్నారు.

- డాక్టర్ మస్తాన్‌బాషా, ఆర్థోపెడిక్ సర్జన్, జీజీహెచ్

నెల్లూరు వైద్యం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సమాజంలో రకరకాల వ్యాధులు మానవుల మనుగడకు సవాళ్లు విసురుతున్నాయి. అటువంటి వాటిలో ఆస్టియో పోరోసిస్ ఒకటి. జిల్లాలో ఈ వ్యాధిగ్రస్తులు 2.30లక్షల మంది ఉన్నట్లు అంచనా. జిల్లావ్యాప్తంగా వృద్ధులు 5 లక్షల మందికిపైగా ఉండగా వారిలో 1.50 లక్షల మంది బోలు ఎముకుల వ్యాధికి గురైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరుకాక మరో 80వేల మంది మహిళలు, యువకులు ఈ వ్యాధితో బాధపడుతున్నారు. ఉదయగిరి, సీతా రామపురం, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి, రాపూరు తదితర మండలాల్లో వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎక్కువగా ఉంది. ఆధునిక పనిముట్లు, యంత్రాలు అందుబాటులోకి రావడంతో గ్రామాల్లో సైతం శారీరక శ్రమ తగ్గింది. బలవర్ధకమైన ఆహారం తీసుకునే పరిస్థితి లేదు. దీనికితోడు ఆస్టియో పోరోసి స్ వ్యాధిపై అవగాహన లేకపోవడంతో వ్యాధిగ్రస్తుల సంఖ్య ఏటా పెరుగుతోంది.

● మహిళలూ తస్మాత్ జాగత్త...


ఆస్టియో పోరోసిస్ వ్యాధి ప్రభావం మహిళల్లో ఎక్కువగా కనిపిస్తోంది. 45 సంవత్సరాల వయసు పైబడిన మహిళలు ఈ వ్యాధికి ఎక్కువగా గురవుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. కాల్షియం, విటమిన్ డీ లోపం, రుతు క్రమం తొందరగా ఆగిపోవడం, జన్యుపరమైన కారణాలు, రోగ నిరోధక శక్తి తగ్గడం, ఎముకల ఆరోగ్యంపై అవగాహన లేకపోవడం వంటి కారణాల వల్ల మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటోంది. థైరాయిడ్ సంబంధిత వ్యాధులతో బాధపడేవారిలో ఆ ప్రభావం ఎముకల సాంద్రతపై కూడా పడుతోంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి



- జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. నిత్యం వ్యాయామం చేయాలి
- మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. మీగడ తీసిన పాలు, పెరుగు, వెన్న మంచివి.
- పచ్చని ఆకుకూరలు, చేపలు, బాదంపప్పు, నువ్వులు, గుడ్లు వంటివి తీసుకోవాలి.
- ఎక్కువ కాల్షియం, విటమిన్ డీ ఉండే ఆహారం తీసుకోవాలి.
- తృణ ధాన్యాలు కూడా ఎక్కువగా తీసుకోవాలి.
- మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలి.
- ఉడకబెట్టిన బఠానీలు, సోయాబీన్స్, స్వీట్ పొటాటో తరచూ తీసుకోవాలి.
- ఖర్జూరం, కమలాలు, బొప్పాయి, బ్లాక్ బెర్రీ మంచివి

వ్యాధి లక్షణాలు



- బోలు ఎముకల వల్ల తీవ్ర నీరసం, శరీరం వంగిపోవడం
- విరిగిన వెన్నుపూస, ఎముకల వల్ల తీవ్ర నొప్పి
- నడవలేని పరిస్థితి, మనిషి కదలిక మందగించడం

నిర్ధారణ

- శరీరంలో కాల్షియం శాతాన్ని గుర్తించే స్కానింగ్
- మణికట్టు, వెన్నెముకలోని ఎముకలు తనిఖీ
- మహిళల్లో ఈస్ట్రోజన్, పురుషుల్లో టెస్టోస్టీరాన్ స్థాయిని గుర్తించే పరీక్షలు

ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను అధిగమించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, డీఈవో రామారావు

● విద్యార్థులకు ప్రోత్సాహక నగదు, ప్రశంస పత్రాల పంపిణీ



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డీఎంహెచ్‌వో, డీఈవో తదితరులు

నెల్లూరు (విద్య/వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని అధిగమించేందుకు ప్రణాళికా బద్ధంగా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచల య్య, డీఈవో రామారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధపెట్టి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఇతర అనుబంధ కార్యక్రమా ల్లోనూ చురుకుగా ఉండాలని సూచించారు. ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, అది వారి జీవితానికి బంగారు బాట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, నోడల్ అధికారి డాక్టర్ దయాకర్, డెమో కనకరత్నం, డీఎస్‌వో కరుణాకరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటమి మరింత ఉత్తేజాన్నివ్వాలి : వీఎస్‌యూ వీసీ

● కావలి జేబీలో వీఎస్‌యూ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీఎస్‌యు వీసీ విజయభాస్కర్ రావు, రిజిస్ట్రార్ సునీత తదితరులు

కావలిటౌన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) గెలుపోటములు సర్వసాధారణమని, ఓటమి మరింత ఉత్తేజాన్నివ్వాలని వీఎస్‌యూ వీసీ ఎస్ విజయభాస్కర్‌రావు పేర్కొన్నారు. శనివారం జేబీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ డీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వీఎస్‌యూ అంతర్ కళాశాలల క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా వీసీ విజయభాస్కర్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ సునీత, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ సీహెచ్ వెంకట్రాయులు, జేబీ కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా వీసీ క్రీడాకారులను పరిచయం చేసుకుని షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి వీఎస్‌యూ పెద్ద పీట వేస్తుందని తెలిపారు. రిజిస్ట్రార్ సునీత మాట్లాడుతూ వీఎస్‌యూ క్రీడలకందించే ప్రోత్సాహాన్ని క్రీడాకారులు అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. జేబీ పీడీ ప్రసాద్‌రెడ్డి ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించగా, రవీంద్రబాబు పురుషుల విభాగం అబ్జర్వర్‌గా, డాక్టర్ విజయకళ మహిళ విభాగం అబ్జర్వర్‌గా వ్యవహరించారు.

డిజిటల్ మార్కెటింగ్‌తో లాభాలు

● డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి



శిక్షణలో మాట్లాడుతున్న పీడీ నాగరాజకుమారి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పొదుపు సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను డిజిటల్ మార్కెటింగ్ చేసి లాభాలు ఆర్జించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వీ నాగరాజకుమారి సూచించారు. శనివారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో పొదుపు మహిళలు, ఏపీఎంలు, సీసీలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ పొదుపు మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను డైరెక్టు మార్కెటింగ్ చేయవచ్చన్నారు, దీంతోపాటుగా డిజిటల్(ఆన్‌లైన్) మార్కెటింగ్ చేస్తే ఉత్పత్తుల అమ్మకాలు పెరిగి ఇతోధికంగా లాభాలు వస్తాయన్నారు. సెర్ప్ నుంచి ఓన్‌డీసీ వేదికగా నమోదు చేసుకోవాలన్నారు. 1200 రకాల ఉత్పత్తులను మైస్టోర్‌లో ఆన్‌లైన్ చేసే విధంగా టార్గెట్‌గా ఇచ్చారన్నారు. ఆహార ఉత్పత్తుల తనిఖీ శాఖ ద్వారా సర్టిఫికెట్ పొందాలన్నారు. ప్రతి వీవో తప్పని సరిగా ఒకటి చేయించాలని సూచించారు. దీనికి ఆర్థిక చేయూత నివ్వడానికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా ప్రయోజనం పొందాలన్నారు. ఈ శిక్షణలో ఏపీడీ రాజు, ఏపీఎం మందా మస్తానయ్య, ఆహార ఉత్పత్తుల తనిఖీ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని నగదు స్వాహా

నెల్లూరు(క్రైం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని నమ్మించి రూ.లక్షలు కాజేసిన వ్యక్తిపై దర్గామిట్ట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని మాగుంట లేవుట్‌లో సుధీర్ కుటుంబం నివసిస్తోంది. అయన తన కుమార్తెకు ఎంబీబీఎస్ సీటు కోసం ప్రయత్నిస్తుండగా క్రాంతినగర్‌కు చెందిన విజయ కుమార్, సునీల్ పరిచయం అయ్యారు. ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని నమ్మించి పలు దఫాలుగా సుధీర్ నుంచి రూ.30 లక్షలు వసూలు చేశారు. నెలలు గడుస్తున్నా సీటు ఇప్పించకపోవడంతో సుధీర్ వారిని ప్రశ్నించగా మాయమాటలు చెబుతూ వచ్చారు. ఇటీవల సుధీర్ వారిని గట్టిగా నిలదీయడంతో సరైన సమాధానం చెప్పకపోవడంతో బాధితుడు శుక్రవారం రాత్రి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

బోగోలులో ఎంపీడీవో విచారణ

బిట్రగుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ కార్యాలయంలో ఆగస్టు 28న జరిగిన సంఘటనపై వార్డు సభ్యులు జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయగా, ఆయన ఆదేశాల మేరకు శనివారం ఎంపీడీవో సుబ్రహ్మణ్యం విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి జహీర్, సర్పంచు అనిత, ఉపస ర్పంచు జనార్దన్‌రెడ్డితోపాటు వార్డు సభ్యులను ఎంపీడీవో విచారించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నయిమ్‌తాజ్ హసన్, ఏఎస్ఐ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జలదంకి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బీజీ 167 నెంబరు జాతీయ రహదారిపై శనివారం ఎస్ఐ లతీఫున్నీసా ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టారు. ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు జలదంకి పెద్దచెరువుకట్ట కింద మలుపు వద్ద ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేసి వాటికి హెచ్చరిక స్టిక్కర్లు అంటించారు.

● బారికేడ్ల ఏర్పాటు

సంగం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంబయి జాతీయ రహదారిలో బ్లాక్‌స్పాట్‌లుగా ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాలతో పోలీసులు చర్యలు చేపట్టారు. దువ్వూరు, పెరమన క్రాస్ రోడ్డు సమీపంలో గుర్తించిన బ్లాక్‌స్పాట్ ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లను అంటించిన బ్యారికేడ్‌లు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ బ్లాక్‌స్పాట్‌లుగా ఉన్న ప్రాంతాలలో వాహనదారులు పరిమిత వేగంతో వెళ్లాలన్నారు. రోడ్డు నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ

సంగం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజనసంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈవో గోపాల్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు, వంటశాల, విద్యాబోధనను పరిశీలించారు. సకాలంలో సిలబస్ పూర్తిచేసి పదిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధనకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

శ్మశాన స్థలం చూపాలి

కలువాయి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోపుగుంట అగ్రహారంలో రీసర్వే సమస్యలపై శనివారం అధికారులు గ్రామసభ నిర్వహించారు. పలు సమస్యలపై అధికారులకు గ్రామస్థులు అర్జీలు అందజేశారు. రీసర్వేలో తమ భూమి విస్తీర్ణం తక్కువ చూపారని పలువురు ఫిర్యాదు చేశారు. ప్రధానంగా గ్రామానికి సంబంధించిన శ్మశాన స్థలం ఆక్రమణలకు గురై కేవలం 5సెంట్లు కూడా లేదని, ఆక్రమణలు తొలగించి శ్మశాన స్థలం చూపాలని వారు కోరారు. ఈ సమావేశంలో తహసీల్దారు శ్యామ్‌సుందరరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే కాకర్ల రాక

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిలు రానున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ పేలపూడి వెంకటరత్నం శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మండలంలోని కొత్తపేట, నర్రవాడ, దుత్తలూరు పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతసాగరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఆర్ఎన్‌బీ జూనియర్ కాలేజ్‌లో ఎలాంటి అర్హతలేని వారికి ఓపెన్ పదోతరగతి, పదో తరగతి పాస్‌అయిన వారికి ఇంటర్‌లో అడ్మిషన్లు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోఆర్డినేటర్ జిలానీ తెలిపారు. 9441206811 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

ముంపు ప్రాంతాలకు మోక్షమెప్పుడో?

తాత్కాలికంగా పునరావాస కేంద్రాలకు తరలింపు

ఆహార పొట్లాల పంపిణీ ● శాశ్వత పరిష్కారం కావాలంటున్న బాధితులు

కావలిటౌన్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలొస్తే పట్టణ పరిధిలోని మునక ప్రాంతాలు ముంపునకు గురవడం, ప్రజలు నానా ఇబ్బందులు పడటం సర్వసాధారణంగా మారింది. ప్రధానంగా మునునూరు గిరిజన కాలనీ, ఇందిరమ్మ కాలనీ, కావేరిగుంట గిరిజన కాలనీ, వినాయక నగర్ గిరిజన కాలనీ, వెంగాయగారి పాలెం గిరిజన కాలనీ భారీ వర్షాలకు తరచూ ముంపునకు గురవుతున్నాయి. ఇవి లోతట్టు ప్రాంతాలు కావడం, పై నుంచి ప్రవహించే వరదనీరు ముందుకు ప్రవహించేందుకు వీలు లేకుండా ఉండడంతో మునిగిపోతున్నాయి. దీంతో స్థానికులను సమీప ప్రభుత్వ పాఠశాలలను పునరావాస కేంద్రాలుగా చేసి తరలించడం, ఆహారం పంపిణీ చేయడం తంతుగా మారింది. ఈ క్రమంలో తమకు శాశ్వత పరిష్కారం కావాలని బాధితులు కోరుతున్నారు.




ముసునూరు ట్రంకురోడ్డులో నిలిచిన వరద నీరు, వరద నీటిలో మునిగిన ముసునూరు గిరిజన కాలనీ

● త్వరలో శాశ్వత పరిష్కారానికి చర్యలు

ఇటీవల తుఫాన్‌కు మునకకు గురైన ప్రాంతాలను పరిశీలించి, బాధితుల కష్టాలు తెలుసుకున్నా. వరద నీరు నిలవకుండా ముందుకు ప్రవహించేటట్లు అన్ని చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాం. వరద నీటి తరలింపునకు శాశ్వత కాలువల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి.

\- ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి

రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండండి



రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద ఎమ్మెల్యేకు వివరాలు తెలుపుతున్న ఏఈ చంద్రమౌళి

లింగసముద్రం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎగువన వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద అప్రమత్తంగా ఉండాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు.శనివారం సాయంత్రం ఆయన ప్రాజెక్టును సందర్శించి, నీటిమట్టాన్ని పరిశీలించారు.ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 20 అడుగులు కాగా, ప్రస్తుతం 15 అడుగులకు నీరు చేరిందని ఏఈ చంద్రమౌళి ఎమ్మెల్యేకి వివరించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున 20 అడుగులు నీరు చేరాక గేట్లు తెరిచి నీరు విడుదల చేస్తే, మన్నేరు పరీవాహక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారులు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

● భక్తులకు మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం

వలేటివారిపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మాలకొండస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భక్తులకు కల్పిస్తున్న వసతులను డీసీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీసీ కేవీ సాగర్‌బాబు, ఎస్ఐ మరిదినాయుడు, టీడీపీ నేతలు మాదాల లక్ష్మీనరసింహ, కాకుమాను హర్షకుమార్, దార్ల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే ధ్యేయం : కాకర్ల



సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని పల్లెలను అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శనివారం పల్లెపండుగ కార్యక్రమంలో మండలంలోని నేలటూరు, శకునాలపల్లి, జీ.చెర్లోపల్లి, జీ.చెరువుపల్లి పంచాయతీల్లో రూ.85 లక్షల ఉపాధి నిధులతో నిర్మించనున్న సిమెంట్‌రోడ్లకు నాయకులు, అధికారులతో కలిసి భూమిపూజ నిర్వహించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ. 22.67 కోట్లతో సిమెంట్‌రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. నియోజకవర్గంలో సాగు, తాగునీరు తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, పీఆర్ ఏఈ శ్రీనివాసరాజు, తహసీల్దారు సుభద్ర, టీడీపీ రాష్ట్ర నాయకుడు చెంచలబాబుయాదవ్, సర్పంచులు మతకాల తిరుపతమ్మ, పద్మ, పేర్నపాటి గీత, ఏపీడీ గాయత్రీ, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, మన్నేటి వెంకటరెడ్డి, రియాజ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

● గ్రామాల రూపురేఖల మార్పు

లింగసముద్రం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంతో పల్లెసీమల రూపురేఖలు మారతాయని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు.శనివారం మండలంలోని ముత్యాలపాడు, పెదపవని, చినపవని గ్రామాల్లో జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముత్యాలపాడులో రూ.21.33 లక్షలు, పెదపవనిలో రూ12.67 లక్షలు, చినపవనిలో రూ.26.77 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో కే శ్రీనివాసులు, ఎంపీటీసీ తూమాటి గిరిజమ్మ, టీడీపీ నాయకులు జీ సాంబయ్య, సీహెచ్ మనోహర్, మైమాధవ, బీ శ్రీనివాసులు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

● సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

ఉలవపాడు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి) : 'పల్లె పండుగ' లో భాగంగా మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలోని ఐదు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా మంజూరైన రోడ్లు సుమారు రూ.33 లక్షలతో కరేడులో నాగులు రోడ్డు, కొత్తపల్లెపాలెంలో రోడ్డు పనులు చేపట్టనున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ రమణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భాస్కర్, టీడీపీ నాయకులు పోలుబోయిన శ్రీనివాసులు, కన్నా ప్రసాదు, మెట్టా శ్రీనివాసులరెడ్డి, బీజేపీ నాయకురాలు తిరుమల, జయరాం, నాయుడు కోటయ్య, పున్నెపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● మోపాడులో 'పల్లె పండుగ'

కందుకూరు, అక్టోబరు 19:(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మోపాడులో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం సిమెంటు రోడ్లకు భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయం సిబ్బంది, టీడీపీ నాయకులు తోలక వెంకటేశ్వర్లు, రావుల రవి, ఇంటూరి రమేష్, సతీష్, వంశీ, మోహన్‌రావు, కోటేశ్వరరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టైలర్ల సమస్యలు పరిష్కరించాలి



సీఎంకు వినతిపత్రం అందచేస్తున్న షేక్ రఫీ

కందుకూరు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాపంగా ఉన్న టైలర్ల సమస్యలను పరిష్కరించాలని ముస్లిం, మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ రఫి కోరారు. ఈ మేరకు శనివారం ఆయన మంగళగిరి టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందచేశారు. టైలర్లకు ప్రత్యేకించి 50 ఏళ్లకే పింఛన్లు మంజూరు చేయాలని, రాయితీపై టైలర్ షాపులకు విద్యుత్ సరఫరా చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల యూనిఫారం దుస్తులు కుట్టడానికి టైలర్ సంఘాలకు అనుమతి ఇవ్వాలని, కంటి చూపు పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు ఇవ్వాలని, ఉపాధి పరంగా జీవన అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలవాలని ఆ వినతి పత్రంలో కోరారు.

చెరువు గండి పూడ్చిన రైతులు



గండి పూడ్చుతున్న ఎక్స్‌కవేటర్

కొండాపురం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వర్షాలకు మండల పరిధిలోని కొమ్మి గ్రామంలోని గండికట్ల చెరువుకు శనివారం ఉదయం గండి పడింది. దీంతో అప్రమత్తమైన అధికారులు, రైతులు తీవ్రంగా శ్రమించి గండి పూడ్చారు. ఇరిగేషన్ అధికారుల సూచనలతో ఆయకట్టు రైతులు ఎక్సవేటర్ సాయంతో రింగు బండ్‌ను ఏర్పాటుచేసి నీరు వృథా పోకుండా ఆపుకోగలిగారు. ఎస్సై ఎమ్.వెంకటరావు, స్థానిక నాయకులు, రైతులు దగ్గరుండి సహాయ సహకారాలు అందించారు.

వర్షిణీప్రియకు తృతీయస్థానం

కొండాపురం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 1న నెల్లూరు దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన వక్తృత్వ పోటీలో నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బీ వర్షిణీప్రియ తృతీయస్థానం సాధించింది. దీంతో ఆమెకు శనివారం డీఈవో కార్యాలయంలో డీఎంహెచ్‌వో పెంచలయ్య, డీఈవో రామారావు, జిల్లా సైన్సు అధికారి కరుణాకరరెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రంతోపాటు రూ.2000 నగదు అందచేశారని పాఠశాల హెచ్‌ఎం మారుతి తెలిపారు.

కలిగిరిలో ఉప్పొంగిన వాగులు

కలిగిరి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కురిసిన వర్షానికి వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహించాయి. భట్టువారివారిపాలెం గ్రామం వద్ద వాగు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో తహసీల్దారు రవీంద్రబాబు, ఎంపీడీవో ప్రత్యూషలు వాగువద్ద ప్రజలు దాటకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టారు. ప్రవాహ ఉధృతి పూర్తిగా తగ్గేంతవరకు ప్రజలు గ్రామంలోనే ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సూరేపల్లి మాధవ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాలకొండ ఆదాయం రూ. 6,43,024

వలేటివారిపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 6,43,024 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. అష్టోత్తరం టికెట్ల ద్వారా రూ. 5,850, కుంకుమార్చన ద్వారా రూ. 18,040, వివాహాల ద్వారా రూ. 3 వేలు, తలనీలాల ద్వారా రూ. 32,950, వాహనపూజల ద్వారా రూ. 4,100, ప్రత్యేకదర్శనం ద్వారా రూ. 1,75,000, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 580, రూము అద్దెల ద్వారా రూ. 32,280, కవర్ల ద్వారా రూ. 5,400, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 1,68,910, అన్నదానం ద్వారా రూ. 1,96,114, ఆదాయం లభించినట్లు ఆయన వివరించారు.

వరద బాధితులకు సహాయం

కందుకూరు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితులకు మోపాడు గ్రామస్థులు ఆర్థిక సహాయం అందచేశారు. శనివారం కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని కలిసి వారు రూ.1,00,000 చెక్కు అందచేశారు. కార్యక్రమంలో తోకల సుబ్బారావు, చిరంజీవిరెడ్డి, దామా మల్లేశ్వరరావు, వెంకట లక్ష్మీ, పుష్ప, శ్రీదేవి, చెన్నారెడ్డి, నరసింహం తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో లోతట్టు ప్రాంతాల జలమయం

● నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే కాకర్ల



కనియంపాడు వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

వింజమూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం ఉదయం కుండపోత వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వింజమూరు పంచాయతీ పరిధిలోని జీబీకేఆర్ ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ లోతట్టు ప్రాంతాల్లోని సుమారు 100 ఇళ్లలోకి నీరు చేరింది. మండల, పంచాయతీ అధికారులు, టీడీపీ నాయకులు, సర్పంచ్ ఎక్స్‌కవేటర్ సహాయంతో కాలువలు తీయించి యుద్ధప్రాతిపదికన నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బీసీ కాలనీ, జీబీకేఆర్ ఎస్టీ కాలనీలలో వరద నీటిలోకి దిగి నీట మునిగిన ఇళ్లను, ముగ్గాలను తమ ఫోన్‌లో ఫోటోలు తీసి ఉన్నతాధికారులకు పంపించి వారితో మాట్లాడారు. వర్షపు నీటిని బయటకు పంపించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నీట మునిగిన ఇళ్లకు నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం పునరావాస కేంద్రాలలో ఆహారం అందించడంతోపాటు వారికి అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, కాకర్ల వెంకట్, రావిపాటి సాంబయ్య, జూపల్లి రాజారావు, నీలం పెరుమాళ్లు, సర్పంచ్ సృజన, ఎంపీటీసీ సభ్యురాలు యాకసిరి భవానీవాణి, టీడీపీ నాయకురాలు జయలక్ష్మీ, తహసీల్దారు ఎస్ఎం హమీద్, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, ఇరిగేషన్ డీఈ రమణారావు, ఏఈ మహేంద్ర, ఇతర కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● స్తంభించిన జనజీవనం

దుత్తలూరు (ఉదయగిరి రూరల్)(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు మండలంలో శనివారం భారీవర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. మండలంలోని ముత్తరాశిపల్లి వద్ద ఉన్న గూబలవాగు, ఏరుకొల్లు వద్ద ఉన్న కావేరి వాగులు ఉధృతంగా ప్రవహించడంతో ఆయా గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. దుత్తలూరు బీసీ కాలనీతోపాటు పలుకాలనీల్లో వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరడంతో పరజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దుత్తలూరు చెరువుకట్టపై ఉన్న విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తహసీల్దారు నాగరాజు, ఎస్ఐ ఆదిలక్ష్మిలు ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

● వరికుంటపాడు : ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడ్డారు. వాగులు, వంకల్లో చేరిన వరద నీరు సమీప వంతెనలపై ఉధృతంగా ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై వరి విత్తనాలు

కావలి రూరల్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో రైతుల కోసం రాయితీపై ప్రభుత్వం వరి విత్తనాలను అందుబాటులో ఉంచిందని మండల వ్యవసాయశాఖ అధికారి లలిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని రైతులకు పంపిణీ కోసం రైతు సేవా కేంద్రాలల్లో కెఎన్ఎం1638 రకం 300 కింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉంచిందన్నారు. 25 కిలోల ధర రూ. 1215 కాగా, రాయితీపై రూ.1065కి అంది చేస్తామన్నారు. బీపీటీ 5204 రకం వరి విత్తనాలు 30 కిలోల ధర రూ.1045 కాగా, రాయితీపై రూ. 920లకు ఇస్తామన్నారు.

బహుమతుల అందజేత



ఉదయగిరి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల ఆదరణ పొందేందుకు సీతారామపురం మార్గంలో తిరిగే బస్సుల్లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీమ్‌లో విజేతలైన ప్రయాణికులకు శనివారం ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బస్సుల్లో ఏర్పాటు చేసిన బాక్సుల్లో టిక్కెట్లను లాటరీ తీయగా షేక్ మస్తాన్, చెన్నయ్యలు విజేతలుగా నిలవడంతో వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్రిష్ణాపాడులో భూముల రీసర్వేపై గ్రామసభ



కావలి రూరల్: మన్నంగిదిన్నె గ్రామసభలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో

జలదంకి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో తప్పొప్పుల సవరణలకు రెవెన్యూశాఖ గ్రామసభలు నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా శనివారం మండలంలోని క్రిష్ణాపాడులో తహసీల్దారు ప్రమీల గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో భూయజమానులు భూవిస్తీర్ణం, పేర్లు తప్పులపై అధికంగా అర్జీలు అందజేశారు. తహసీల్దారు మాట్లాడుతూ రీసర్వేలో వచ్చిన తప్పులపై సవరణలు చేపడతామని, భూయజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామసభలో రీసర్వే డీటీ శ్యాంసన్ ఆర్ఐ శ్రీజ, రైతులు పాల్గొన్నారు.

● గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

కావలి, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): భూసమస్యలు పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో ఎం. వంశీక్రిష్ణ తెలిపారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయంలోని తన చాంబరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కావలి డివిజన్‌లో ఈనెల 19 నుంచి నవంబరు14 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా భూముల హక్కుల్లో ఏవైనా సమస్యలు ఏర్పడితే వాటిని గ్రామసభలలో పరిష్కరించుకోవచ్చన్నారు.

● రీసర్వేలో పొరపాట్లను సవరించుకోండి

అల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో ఏవైనా పొరపాట్లు ఏర్పడి ఉన్న రైతులు సవరించుకునేందుకు గ్రామసభలను నిర్వహిస్తున్నామని తహసీల్దారు లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. మండలంలోని పురిణిలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు రీసర్వేలో తమకు ఎదురైన సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వీటిని వెంటనే పరిష్కరించి వెబ్‌ల్యాండ్ రికార్డులను సరిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే ఆర్ఐ ప్రభుదీప్ పాల్గొన్నారు.

● భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభ

బిట్రగుంట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : భూ రీసర్వేలో రైతుల పొలాల వివరాల్లో తప్పులు, సమస్యలు ఉంటే, వాటిని పరిష్కరించుకునేందుకే గ్రామసభలు నిర్వహిస్తునట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. బోగోలు మండలం సాంబశివాపురంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. పలు సమస్యలపై 41 మంది రైతులు అధికారులకు అర్జీలు అందచేశారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ గీత, మండల సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి, ఆర్ఐ వాజీద్, వీఆర్వో మాల్యాద్రి, గ్రామ సర్వేరు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

● భూసమస్యల పరిష్కారానికే గ్రామసభలు

కావలి రూరల్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల సత్వర పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో వంశీక్రిష్ణ పేర్కొన్నారు.కావలి మండలం మన్నంగిదిన్నెలో శనివారం జరిగిన గ్రామ సభను ఆర్డీవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు భూ సమస్యలను ఈ గ్రామసభల్లో అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం పొందవచ్చన్నారు. గ్రామసభలో తహసీల్దార్ శ్రావణ్ కుమార్, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో బాలకోటయ్య, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధవి

ఆత్మకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉంటూ పంటల సాగుపై అవగాహన కల్పించాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జి లక్ష్మీమాధవి తెలిపారు. స్థానిక మార్కెట్ కమిటీ ప్రాంగణంలో శనివారం ఆత్మకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట మండలాల గ్రామ వ్యవసాయ సహాయకులకు ఆత్మ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగుచేయబోయే వరికి అనువైన రకాలు, విత్తనశుద్ధి, నారుమళ్ల పెంపకం, సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులు, మెలకువలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఏడీఏ వీ దేవసేనమ్మ, కృషి విజ్ఞాన కేంద్రం ఎస్ఎంఎస్‌డీ విజయకుమార్ నాయక్, ఆత్మకూరు ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ రాజశేఖర్, ఆత్మకూరు, అనంతసాగరం ఏఎస్‌పేట మండలాల వ్యవసాయ శాఖాధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దర్గా, గుడి సమీపంలో మద్యం దుకాణం వద్దు

ఏఎస్‌పేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసనాపురం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని గ్రామస్థులు జిల్లా కలెక్టరుకు శనివారం ఫిర్యాదు చేశారు. సర్వే నెం 20లో కొండ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి నూతనంగా మద్యం దుకాణం ఏర్పాటు చేశారని, బంగారమ్మ గుడి, దర్గాకు సమీపంలో ఏర్పాటు చేశారని వాపోయారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా వేరే ప్రదేశానికి మద్యం దుకాణం మార్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు విన్నవించినట్లు గ్రామస్థులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై కళాజాత

వరికుంటపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వాడి పంచాయతీ కార్యాలయంలో శనివారం సీజనల్ వ్యాధులకు సంబంధించి కళాజాత నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నెల్లూరు నుంచి వచ్చిన చైతన్య జానపద కళాకారుల బృందం ఆధ్వర్యంలో డయేరియా, మలేరియా, డెంగ్యూ, సీజనల్ వ్యాధులకు సంబంధించి కళా ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే పర్యావరణ పరిరక్షణ, ఉపాధిహామి పథకం గురించి గేయాలు, నాటికల రూపంలో వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శేషం నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి రామాయణం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. తూర్పుబోయమడగల, తూర్పుచెన్నంపల్లి గ్రామ పంచాయతీల్లోనూ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొండపోరంబోకు భూమిలో సీడ్‌బాల్స్

ఉదయగిరి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ వెంకట్రావుపల్లి వద్ద ప్రభుత్వ కొండపోరంబోకు భూమిలో శనివారం ఎస్ఎన్ఐఆర్‌డీ, ఎఫ్ఈఎస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సీడ్‌బాల్స్ వేసే కార్యక్రమం చేపట్టారు. ఉమ్మడి వనరుల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ పోరంబోకు భూమిలో సీడ్‌బాల్స్ వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, ప్రాజెక్టు మేనేజరు నాగార్జున, కోఆర్డినేటర్ కేశవనారాయణ, క్షేత్రసహాయకుడు నారాయణరెడ్డి, వసంతరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న మూలం రమేష్

అనంతసాగరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతర పోరాటం చేస్తోందని జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. మండలంలోని ఆమనిచిరివేళ్లలో శనివారం జరిగిన మండల మహాసభలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జమిలీ ఎన్నికల విధానాన్ని వ్యతిరేకించాలని కోరారు. అనంతరం మండల నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో గంటా లక్ష్మీపతి, పుల్లయ్య, అన్వర్‌బాష, సుబ్బారాయుడు, ఖాదర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోండి

● ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ కృష్ణకాంత్

ఇందుకూరుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశించారు. శనివారం ఆయన ఇందుకూరుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. పోలీస్‌స్టేషన్ భౌగోళిక స్థితిగతులు, పరిసరాలతో పాటు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ మాట్లాడుతూ చోరీ కేసుల్లో సొత్తు రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రౌడీషీటర్‌లు, సస్పెక్ట్‌లు, పాత నేరస్థులపై నిఘా పెంచాలని ఆదేశించారు. కేసులపై దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే పోలీస్ సిబ్బంది, అధికారులు తప్పక హెల్మెట్ ధరించాలని, లైసెన్స్, బైకును కండిషన్‌లో ఉంచుకోవాలని సూచించారు. గ్రామాలను సందర్శించి ప్రజలతో మమేకమై సమస్యలు, ఆస్తి వివాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ మోసాలు, ఇసుక అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాలు, మహిళలు, బాలబాలికలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. స్టేషన్ పరిసరాల్లో పచ్చదనం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస రావు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

ఘనంగా శుకదేవస్వామి పుట్టినరోజు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుకదేవస్వామి పుట్టిన రోజును శనివారం ఘనంగా నిర్వహించారు. మందిరంలో జరిగిన ఈ వేడుకల్లో నగరంలోని పలువురు భక్తులు, దాతలు, తదితరులు పాల్గొని శుకదేవస్వామిని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రభుపాద స్వామికి, జగన్నాథస్వామిలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హారతులు జరిగాయి.

● రోడ్లు, కాలువల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు ● పట్టించుకోని పంచాయతీ అధికారులు, పాలకులు

పల్లెల్లో ప్లాస్టిక్ భూతం

గ్రామీణ ప్రాంతాలను సైతం ప్లాస్టిక్ భూతం పట్టి పీడిస్తోంది. ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరగడంతో పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోంది. పర్యావరణ కలుషితం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించినా అధికారుల నిర్లక్ష్యంతో అది ఆచరణకు నోచుకోవడం లేదు. దీంతో పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం ప్లాస్టిక్ వినియోగం ఘననీయంగా పెరిగింది. ఫలితంగా నివాసప్రాంతాల మధ్యలో, డ్రైనేజీ కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతోన్నాయి. ఆ వ్యర్థాల్లో పశువులతో పాటు పందులు సైతం సంచరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

వెంకటాచలం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వెంకటాచలం మండలంలోని కసుమూరు, సర్వేపల్లి, గొలగమూడి, వెంకటాచలం, నిడిగుంటపాళెం, కాకుటూరు, పూడిపర్తి తదితర గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసుల వినియోగం విపరీతంగా పెరిగింది. ఎక్కడ చూసిన కిరణా దుకాణాలతోపాటు ఇతర దుకాణాల్లో కూడా కవర్ల వాడకం ఎక్కువగా ఉంది. దీంతో రోడ్లు, కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. నిషేధాన్ని అమలు చేయాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకం విచ్చలవిడిగా పెరిగిపోయింది. పట్టణాల్లో ఎక్కవ వినియోగించే ప్లాస్టిక్ కవర్ల వాడకం గ్రామాల్లో కూడా విస్తరించడంతో గ్రామాల్లో ఉండే పచ్చని వాతావరణం పాడై వాతావరణం కలుషితమవుతోంది. రోడ్లు, కాలువల్లో చూసిన ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతుండడంతో కాలువల్లో మురుగు నీరు పోయే దారులు మూసుకుపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో ప్లాస్టిక్ అమ్మకాలు, వినియోగాన్ని నిషేధించాల్సిన అవసరం ఉంది.

కసుమూరులో పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు



● మురికి కూపంగా కసుమూరు

పారిశుధ్యం పట్ల ప్రజల్లో అవగాహన లేకుంటే పరిస్థితులు ఎలా ఉంటాయో కసుమూరు పంచాయతీని చూస్తే అర్థమవుతోంది. పంచాయతీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. పశువులు, జీవాల పేడ దిబ్బలు, మురుగు నీటి నిల్వలు, చెత్త దిబ్బలు దర్శనమిస్తున్నాయి. దర్గా పరిసరా ప్రాంతాలతోపాటు సమీపంలో అయితే ప్లాస్టిక్ వ్యర్థాలతో అధ్వానంగా ఉంది. పంచాయతీ పాలకులు, అధికారులు పట్టించుకోకుండా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం వల్ల అంటూ వ్యాధులు ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం

కసుమూరు పంచాయతీతోపాటు దర్గా పరిసరాలు, రోడ్ల పక్కనే చెత్త దిబ్బలు, ప్లాస్టిక్ నిల్వలపై గతంలో పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశాం. అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చాం. అయినా ఏ ఒక్కరూ కూడా పట్టించుకోలేదు. ప్రస్తుతం కసుమూరు పంచాయతీతోపాటు దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపర్చడంతో పాటు ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలి.

- నక్కా శివకుమార్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు



న్యూస్ బాక్స్

రాయితీ పథకాలపై అవగాహన

సైదాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలూరు గ్రామంలో మండల వ్యవసాయశాఖ అధికారి హైమావతి ఆధ్వర్యంలో శనివారం పొలం పిలుస్తోంది గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రభుత్వ రాయితీ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ రబీసీజన్ ప్రారంభం కావడంతో రాయితీపై విత్తనాలను త్వరలో అందచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి ఆనంద్, శాస్త్రవేత్త నాయక్ పాల్గొన్నారు.

డీఎస్పీతో ఆనం విజయ భేటీ

నెల్లూరు(క్రైం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, పలువురు నాయకులు శనివారం నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలపై డీఎస్పీతో విజయకుమార్‌రెడ్డి చర్చించారు.

చర్యలు తీసుకుంటాం

మనుబోలు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడూరుపాళెం మత్స్యకార సొసైటీలో జరిగిన అవకతవకపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఏడీ రంగనాథబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మత్స్యకార సొసైటీలో ఓసీలకు సభ్యత్వం ఉండదన్నారు. అలాంటిది ఓసీలను చేర్పి పించను అందజేస్తున్నట్లు తెలిసిందని, దీనిపై విచారణ చేస్తామన్నారు. బద్దెవోలు రెవెన్యూ పరిధిలో ఓ రైతు వేసిన చేపల గుంతల వలన తమపైర్లు దెబ్బతిం టున్నాయని పిడూరుపాళెం రైతులు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై తహసీల్దారు సీహెచ్. సుబ్బయ్యతో కలిసి గుంతలను పరిశీలించామన్నారు. త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లాఠీచార్జి దుర్మార్గం : బీజేపీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం దగ్గర ఆందోళన చేస్తున్న హిందూ సంఘాలపై పోలీసులు లాఠీచార్జి చేయడం దుర్మార్గమని బీజేపీ నమామి గంగే ప్రాజెక్టు రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని హిందూ సంఘాలు డిమాండ్ చేస్తే వారిపై పోలీసులు దాడి చేయడం హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని తెలిపారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

సైదాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మండల శాఖల అధికారులతో మండల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రభలకుండా గ్రామాల్లో చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పోలయ్య పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నెల్లూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పెళ్లై నాలుగేళ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టలేదన్న ఆవేదనతో ఓ వ్యక్తి బలవన్మరణానికి యత్నించాడు. రూరల్ పోలీసులు అందించిన వివరాల మేరకు.. జిల్లాలోని జలదంకి మండలానికి చెందిన అజిత్ (28) కూలి పనుల నిమిత్తం నెల్లూరు రూరల్లోని ధనలక్ష్మీపురంలో నివాసముంటున్నాడు. అతనికి నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఇప్పటి వరకు సంతానం కలగలేదన్న మనస్తాపంతో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలు రావడంతో స్థానికులు గుర్తించి జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా సమాచారం అందుకుని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ సీఐ వేణు తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

మనుబోలు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఐ.శివరాకేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైసీపీ పాలనలో 'రెవెన్యూ' గందరగోళం



నెల్లూరురూరల్ : అర్జీదారుడితో మాట్లాడుతున్న గిరిధర్‌రెడ్డి



కోవూరు : మాట్లడుతున్న తహసీల్దారు నిర్మలానందబాబ

● టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవస్థను గందరగోళం చేశారని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని దేవరపాళెంలో గ్రామ రెవెన్యూ సదస్సును ఆయన ప్రారంభించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ పాలనలో ఒక్క రైతుకు కూడా రెవెన్యూ పరంగా న్యాయం జరగలేదని ఆరోపించారు. రికార్డుల ట్యాంపరింగ్ జరిగిందన్నారు. వాటన్నిటినీ సరిదిద్ది అందరికీ న్యాయం చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తెలిపారు. అనంతరం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పొట్టేపాళెం గ్రామంలో రూ.20 లక్షలతో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలలో ఎంపీపీ విజయకుమార్, ఎంపీడీవో శైలేంద్రకుమార్, వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్లు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుపల్లిపాడులో 19 అర్జీలు

మనుబోలు(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపల్లిపాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 19 మంది రైతులు రీసర్వేలో తప్పిదాలపై ఫిర్యాదులు ఇచ్చినట్లు తహసీల్దారు సీహెచ్.సుబ్బయ్య తెలిపారు. ఈ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రీసర్వే తహసీల్దారు మంజుల, ఆర్ఐ.నారాయణ, వీఆర్వో శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పులు సరిదిద్దుతాం

కోవూరు(ఆంధ్రజ్యోతి): గతంలో చేపట్టిన భూసర్వేలో లోపాలను సరిదిద్దేందుకు మండల పరిధిలోని గంగవరం గ్రామంలో శనివారం రెవెన్యూ సర్వే అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు నిర్మలానందబాబ మాట్లాడుతూ రీ సర్వేలో వచ్చిన సమస్యలపై రైతులు ఫిర్యాదు చేస్తే సరిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే ఇన్‌స్పెక్టరు రఘురామరాజు, సర్వేయర్లు పీ రమేష్, హర్షిణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టరు రాకేష్ పాల్గొన్నారు.

జొన్నవాడలో 21 ఫిర్యాదులు

బుచ్చిరెడ్డిపాళెం(ఆంధ్రజ్యోతి): జొన్నవాడలో జరిగిన రీ సర్వే గ్రామసభలో జిల్లా సర్వే, ల్యాండ్స్ అధికారి నాగశేఖర్, తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొని రైతుల నుంచి 21 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి, వీఆర్వో సౌమ్య, సర్పంచు కందికట్టు పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొలకొచ్చే విత్తనాలనే అమ్మాలి

● దుకాణదారులను హెచ్చరించిన ఏడీఏ శ్రీనివాసులు

నెల్లూరు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : రబీ వ్యవసాయ సీజన్ మొదలైనందున ముప్పాతిక శాతానికిపైగా మొలకలు వచ్చే విత్తనాలనే రైతులకు విక్రయించాలని నెల్లూరు ఏడీఏ శ్రీనివాసులు దుకాణదారులను హెచ్చరించారు. ఏవో నాగమోహన్‌తో కలిసి రూరల్, సిటీ ప్రాంతాల్లోని విత్తనాల దుకాణాల్లో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు కచ్చితంగా సదరు షాపు వద్ద రశీదు పొందాలన్నారు. విత్తనాలు మొలకెత్తకుంటే ఆ రశీదుతో వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేయాలని సూచించారు. విత్తన దుకాణాల్లో కచ్చితంగా కొనుగోలుదారుల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. కాగా, ప్రస్తుత సీజన్‌లో బీపీటీ రకాలు వేసేవారు ఈ నెలాఖరుకల్లా నార్లుపోసుకోవాలని, ఆర్ఎన్ఆర్, కేఎన్ఎం రకాలు వేసేవారు నవంబరులో నార్లుపోసుకోవాలని రైతులకు దిశానిర్దేశం చేశారు.



విత్తన దుకాణంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కూటమి ప్రభుత్వంలో ప్రజాపాలన

● నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

తోటపల్లిగూడూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాపాలన జరుగుతోందని సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపాలెంలో శనివారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొని రూ.10లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన గ్రామ సర్పంచు చేవూరు పద్మావతి, మాజీ సర్పంచు చేవూరు శ్రీనివాసులుతో కలసి గ్రామంలో కాలనీలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలతోపాటు పాఠశాలలు, వైద్యశాలలు, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులను సమకూర్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. మాజీ మంత్రి కాకాణి విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బొమ్మి సురేంద్ర, సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, ముత్యాల శ్రీనివాసులు, శ్రీహరి, వెంకటేశ్వర్‌యాదవ్, పంచాయతీరాజ్ శాఖ ఏఈ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు సాంస్కృతిక పోటీలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు కల్చరల్ అసోసియేషన్ 35వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం పురమందిరంలో రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బీరంగుంట శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాస్త్రీయ నృత్యం (గ్రూప్), శాస్త్రీయ నృత్యం (సోలో), వెస్టన్ డాన్స్, పాటలు, యోగా, ఫ్యాన్సీ డ్రెస్, ఏకపాత్రాభినయం విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఉదయం 10గంటలకు పోటీలు మొదలవుతాయని, విజేతలకు నగదు బహుమతులు, పతకాలు అందజేస్తామన్నారు. సాయంత్రం ప్రత్యేక కళా ప్రదర్శనలు, బహుమతి ప్రదానోత్సవం జరుగుతాయని తెలిపారు.

కామాక్షితాయి సేవలో పూర్వ ఉపరాష్ట్రపతి సతీమణి



హారతి తీసుకుంటున్న ఉషమ్మ

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ శనివారం మల్లికార్జునస్వామి, కామాక్షితాయిలను దర్శించుకున్నారు. ఆలయ ఈఓ, అర్చకులు ఆమెను ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. స్నేహితులతో కలసి వచ్చిన ఆమె వెంట సీఐ శ్రీనివాసులురెడ్డి ఉన్నారు. అనంతరం నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండకు వెళ్లి వేదగిరి లక్ష్మీనరసింహ స్వామిని దర్శనం చేసుకున్నారు.

ఏ ఊరికెళ్లినా అన్నీ సమస్యలే..!

● పల్లె పండుగ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గంలో ఏ ఊరికెళ్లినా అన్నీ సమస్యలే దర్శనమిస్తున్నాయని, గత 5 ఏళ్లలో ఒక్క కాలువ, రోడ్డు అభివృద్ధి చేసిన జాడేలేదని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని పెనుబల్లిలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆమె పాల్గొని గిరిజనకాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె పండుగ కార్యక్రమంలో బుచ్చి మండలానికి రూ.82 లక్షలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. పెనుబల్లిలో రూ.22 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. అలాగే ఈనెల 21వ తేదీ నుంచి బుచ్చిరెడ్డిపాళెంలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తున్నామని, మండలంలో 30 ఏళ్ల పైబడిన మహిళలు ఆధార్‌కార్డు తీసుకెళ్లి ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీహరి, నాయకులు హరికృష్ణ, మహేంద్ర, సురేంద్ర, పెంచలయ్య, గోపి, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



బుచ్చి : పెనుబల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

పల్లె పండుగతో గ్రామాలాభివృద్ధి

విడవలూరు(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో అందిస్తున్నారని, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పల్లె పండుగకు శ్రీకారం చుట్టడంతో గ్రామాలను అభివృద్ధి పరుస్తున్నామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. విడవలూరు ఇందిరా నగర్ కాలనీ, వావిళ్లలో శనివారం జరిగిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సుమారు రూ.15లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు కారణంగా ఎక్కడైనా చెరువులు, కాలువలకు గండి పడితే ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్, ఎంపీడీవో నగేష్‌కుమారి, టీడీపీ నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, చెముకుల శ్రీనివాసులు, సత్యవోలు సత్యంరెడ్డి, పొన్నలూరు పురంధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'అవగాహనతోనే ఆస్టియో పోరోసిస్ దూరం'

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆస్టియో పోరోసిస్ (ఎముకలు గుల్లబారటం) వ్యాధిని అవగాహనతో పూర్తిగా నివారించవచ్చని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కుమార్‌బాబు, డాక్టర్ శశిధర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆసుపత్రిలో అస్టియో పోరోసిస్‌పై అవగాహన సదస్సు జరిగింది. వారు మాట్లాడుతూ ఎముకల్లో చేవ తగ్గిపోవటం, దృఢత్వం కోల్పోవటం, బోలుగా మారటాన్ని అస్టియో పోరోసిస్ వ్యాధిగా నిర్ధారిస్తారన్నారు. ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే జీవితాంతం వికలాంగులుగా మారే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. 50 ఏళ్లు పైబడిన ప్రతి ఐదుగురిలో ఒకరు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయన్నారు. అయితే 20శాతం మంది వ్యాధిగ్రస్తులు మాత్రమే చికిత్స పొందుతున్నారని చెప్పారు. మహిళల్లో ఈ వ్యాధి ఎక్కువగా కనిపిస్తుందని క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. ధూమపానం, మద్య పానం అలవాట్లకు దూరంగా ఉండా లన్నారు.

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పొదలకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు శనివారం డిస్లెక్సియా ఫర్ వాక్‌పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భగా హెచ్ఎం సనత్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల చట్టం-2016 ప్రకారం 21రకాల వైకల్యాలలో నిర్దిష్ట అభ్యసన వైకల్యం ఒకటిని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ప్రత్యేక శిక్షణతో అభ్యసన సమస్యలను అధిరోహించవచ్చని తెలిపారు. స్పెషల్ ఎడ్యుకేషన్ సహోపాధ్యాయుడు రమేష్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు స్కాలర్‌షిప్‌లు, అలవెన్స్‌తో పాటు పదో తరగతి మార్కుల్లో కూడా మినహాయింపు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు సుధాకర్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు సౌత్ రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం వేకువజామున గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 40 నుంచి 45 సంవత్సరాల వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై నలుపు, తెలుపు, పసుపు రంగు డిజైన్ గల ఫుల్ హ్యాండ్స్ టీషర్ట్, పచ్చ రంగుపై డిజైన్ ఉన్న షార్ట్ ఉన్నాయి. ఇతర ఆధారాలేవీ లభించలేదు. ఎస్ఐ మాలకొండయ్య కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. రైలు ఢీకొని మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు.

బాలికను బెదిరించిన యువకుడిపై కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టుబడిపాళెంలో ఓ బాలికను అదే గ్రామానికి చెందిన బి.అంకయ్య అనే యువకుడు తనతో మాట్లాడకుంటే చంపుతానని బెదిరించడంపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే ఆ బాలికపై ఆ యువకుడిపై గత ఏడాది అత్యాచారం చేసినట్టు కేసు నమోదై ఉందని పోలీసులు తెలిపారు.

రామలింగేశ్వరాలయంలో అంకురార్పణ

మనుబోలు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బద్దెవోలులో పురాతన కామాక్షిదేవి రామలింగేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో దేవదాయశాఖ, గ్రామస్థుల సహకారంతో పునర్నిర్మించారు. ఈ ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆలయంలో ప్రతిష్ఠించే మూలమూర్తులు, ఉత్సవమూర్తులను శుద్ధి చేసి, అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను శైవాగమ పండితులు నూతన పాటి సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో రుత్వికులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ ఏర్పాట్లను చిలకపాటి నరసింహాచార్యులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు, తీర ప్రాంతాల గ్రామస్థులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరపురంలో ఆక్రమణల తొలగింపు



కట్టడాలు కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

నెల్లూరు(సిటీ), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వర పురం వద్ద అక్రమ కట్టడాలను కార్పొరేషన్ సిటీప్లానింగ్ అధికారులు శనివారం కూల్చివేశారు. స్థానికుల ఫిర్యాదు నేపథ్యంలో రంగంలోకి దిగిన అధికారులు వెంకటేశ్వరపురం గొర్రెల గంజిఖానా వద్ద నిర్మాణాలను అనుమతులు లేనివిగా గుర్తించారు. ఎక్స్‌కవేటర్ సహాయంతో కట్టడాలను నేలమట్టం చేశారు. నగర పాలక సంస్థ అనుమతి లేకుండా, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కూల్చేస్తామని హెచ్చరించారు.

బ్రాందీషాపు తొలగించాలి


బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెంలోని జొన్నవాడ సెంటర్ సమీపంలోని కామాక్షికాలనీలో బ్రాందీషాపు తొలగించాలని శనివారం మహిళలు నిరసన చేపట్టారు. చుట్టూ పాఠశాలలు, మధ్యలో ఆసుపత్రి ఉన్న తమ ప్రాంతంలో బ్రాందీషాపు ఏర్పాటు తగదన్నారు. దీంతో ఎస్ఐ సంతోష్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ కిషోర్ మహిళల అభ్యంతరంపై విచారించి 3రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో వెనుదిరిగి వెళ్లారు.

టీడీపీ నాయకుడిపై దాడి

కోవూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడుగుపాడు టీడీపీ నేత గొట్టిగుండాల మహేష్‌రెడ్డిపై శనివారం గుర్తుతెలియని వ్యక్తులు దాడి జరిగింది. ఆయన తన వ్యాపార సంస్థ వద్ద ఉండగా ఐదుగురు గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పల్లె టేస్ట్ మారింది గురూ!





కోడి కూతతో నిద్రలేచి, పొద్దు వాలీవాలగానే సద్దుమణిగే పల్లెలు ఇప్పుడు లేవు. పేడ కళ్లాపి చప్పుళ్లు.. పదండి.. పదండి... అంటూ సేద్యపు పనులకు మనుషులను కూడేసుకునే పిలుపులూ.. ఇవన్నీ ఇప్పుడు అంతరించిన దృశ్యాలు..

కాలంతో పాటూ మార్పు సహజం. ఆహార, వేష, భాషలు సహా సకల జీవన వ్యాపారాలనూ ఈ మార్పు ప్రభావితం చేస్తుంది. సమాచారాన్ని క్షణాల్లో అరచేతిలోకి చేర్చే సాంకేతిక యుగంలో వేగం పెరిగింది. నగరాలకు పల్లెలు అనుకరణలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ఆహారపు అలవాట్ల విషయంలో.

రాగి ముద్దా.. సెనిగ్గింజల ఊరుబిండీ, సద్దెన్నం.. వంకాయ బజ్జీ, వంగ ఒరుగులూ.. గురుగాకు పులగూరా.. వంటి పల్లె వంటలు ఇప్పుడు స్టార్ హోటళ్లలో ఖరీదైన డిష్‌లుగా మారిపోగా, నూడుల్స్, బకెట్ చికెన్ లెగ్ పీస్‌లు, చాట్‌లూ పానీపూరీ వంటివి పల్లె నట్టింట తిష్టవేశాయి. నగరవాసులు పల్లె రుచులకోసం అర్రులు చాస్తూవుంటే, పల్లెజనం.. ఫాస్ట్ ఫుడ్ కోసం ఎగబడుతున్నారు.

తిరుపతి, ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

గత పదేళ్లలో జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంత ప్రజల ఆహారపుటలవాట్లలో గణనీయమైన మార్పు చోటు చేసుకుంది. మారుమూల పల్లెల్లో కూడా గోబీ, మష్రూమ్, చికెన్ ఫ్రైడ్ రైస్‌లు, మంచూరియాలు ప్రజలకు లభిస్తున్నాయి. ఇక పానీ పూరీ బండ్లు కనిపించని పల్లె లేదంటే అతిశయోక్తి కాదు. మెట్రో నగరాలకే పరిమితమైన ఆహార పదార్థాలు తిరుపతిని తాకి, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాయుడుపేట, గూడూరు, వెంకటగిరి వంటి పట్టణాలకు విస్తరించి, పల్లెలకు సైతం చేరువలోకి వచ్చాయి. పదేళ్ల కిందటి దాకా సాయంత్రమైతే పిల్లలు, యువత మిర్చి బజ్జీలు, బోండాలు, వడలు వంటివి తినడానికి ఆసక్తి చూపేవారు. అవి కూడా మండల కేంద్రాలు, ఓ మోస్తరు గ్రామ కేంద్రాల్లోనే దొరికేవి. ఇప్పుడా స్థానంలోకి పానీపూరీ, మసాలా పూరీ, ఛాట్ మసాలా, ఫ్రైడ్ రైస్, నూడిల్స్ వంటివి చేరాయి. పట్టణాలు, నగరాల్లో చదువుకుంటున్న విద్యార్థులు, ఉద్యోగ వ్యాపారాలకు వెళ్ళి వచ్చే యువత వీటినే ఇష్టపడుతున్నారు.

ఆదివారం ప్రత్యేకం

250కి పైగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు



పాకాలలో స్టార్ హోటళ్ల తరహా చికెన్ వెరయిటీ ఐటెమ్స్ దొరికే ఒక హోటల్ ఇది. మండల కేంద్రాలూ, కాస్త పెద్ద గ్రామాల్లోనే ఇటువంటివి జిల్లాలో 250 ఫుడ్ సెంటర్లు ఉన్నాయి. గోబీ, మష్రూమ్, చికెన్ ఫ్రైడ్ రైస్ మంచూరియాలు వీటిల్లో దొరుకుతాయి. చంద్రగిరి మండలంలోనే ఇటువంటివి 36 ఉన్నాయి. వరదయ్యపాలెం మండలంలో 35, చిల్లకూరులో 22, తడ మండలంలో 20, చిట్టమూరు మండలంలో 17, నాయుడుపేట మండలంలో 16, తొట్టంబేడు మండలంలో 13, రేణిగుంట మండలంలో 10 వంతున ఈ ఆధునిక ఫుడ్ సెంటర్లు నడుస్తున్నాయంటేనే పల్లెల్లో వీటికి ఎంత క్రేజ్ ఉందో అర్థమవుతుంది.

అలవాటు మారి.. పానీపూరీ



పీచుమిఠాయిల కాలం పోయింది. పిల్లలు ఎగబడి తినే తిండి ఇప్పుడు పానీపూరీ. ఎడ్ల బండ్ల కోసం వెతుక్కోవాలి గానీ, పానీపూరీ బండి లేని పల్లె కనిపించదు. జిల్లాలోని పల్లెల్లో కనీసం మూడొందల పానీపూరీ బండ్లు ఉన్నాయని అంచనా. మండల కేంద్రాల్లో అయితే నాలుగైదు ఉంటాయి. అద్దె కట్టనవసరం లేదు. టాక్స్‌ల గొడవ లేదు. కరెంటు బిల్లుల భారం ఉండదు. కొన్ని గంటలు తెరిచి ఉంచితే చాలు వ్యాపారం జోరుగా సాగుతుంది. కేవీబీపురంలో రోడ్డు పక్కన ఈ పానీపూరీ బండి తరహాలోనే అన్ని పల్లెల్లోనూ వెలిశాయి.

డాబాకి పోదామా!



రేణిగుంటలోని ఒక హోటల్ ఇది

డాబా కల్చర్ పెరిగింది. ముఖ్యంగా రహదారులకు దగ్గరగా ఉన్న ఊళ్ల సమీపంలో డాబాలు వెలుస్తున్నాయి. ప్రయాణీకులతో పాటూ, స్థానిక యువత, కుటుంబాలు.. కాస్త విశ్రాంతిగా వీటికి వెళ్లి తినడం అలవాటు చేసుకున్నారు. చికెన్, మటన్, ఫిష్, ప్రాన్స్ తదితర మాంసాహార వంటకాలపై జనంలో పెరిగిన అనురక్తిని గ్రహించి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. 65, కబాబ్, ఫ్రై, తందూరీ వంటి వంటకాలు, బిరియానీలతో పాటూ ఇక్కడ లభిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా విశేష ఆదరణ కలిగిన కేఎఫ్‌సీ (కెంటకీ ఫ్రైడ్ చికెన్) ని అనుకరిస్తూ ఎక్కడికక్కడ మండల కేంద్రాల్లో కూడా లోకల్ వెరైటీ ఫ్రైడ్ చికెన్ హోటళ్ళు తెరుస్తున్నారు. జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి రెస్టారెంట్లు, దాబాలు, హోటళ్ళు 150కి పైగా వుండగా అందులో 40 దాకా ఏసీ సదుపాయం కలిగి వున్నాయి.



రేణిగుంటలో ఫైవ్ స్టార్ పేరిట చికెన్ వెరైటీస్ లభించే హోటల్

పల్లె పల్లెనా...

వెంకటగిరి నియోజకవర్గంలోని బాలాయపల్లి చాలా చిన్న మండల కేంద్రం. అక్కడ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు రెండు, పానీ పూరీ బండి ఒకటి వుండడమే ఆశ్చర్యకరమైతే ఆ మండలంలోని వెంగమాంబపురంలో ఒకటి, జయంపులో మూడు చొప్పున ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు నడుస్తున్నాయి. సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీపురంలో రెండు బిర్యానీ హోటళ్ళు, ఒక పానీపూరీ బండి నడుపుతున్నారు. జిల్లాలోనే వెనుకబడిన, మారుమూల మండలమైన ఎర్రావారిపాలెంలో కూడా ఎనిమిది పానీపూరీ బండ్లు వుండడం విస్తుగొలుపుతోంది.



బీఎన్ కండ్రిగలోని ఒక ఫాస్ట్ ఫుడ్ సెంటర్

నగరాలకు దీటుగా

చంద్రగిరి, తడ, వరదయ్యపాలెం, చిల్లకూరు తదితర మండలాల్లో నగరాలకు దీటుగా హోటళ్ళు, రెస్టారెంట్లు నడుస్తున్నాయి. జాతీయ రహదారులపై వుండడం, పారిశ్రామికాభివృద్ధి వంటివి దీనికి కారణం. తడలో మూడు స్టార్ హోటళ్ళు, 20 ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, 33 రెస్టారెంట్లు (అందులో 25 ఏసీ), మరో 6 దాబా హోటళ్ళు చొప్పున మొత్తం 62 వున్నాయి. పరిశ్రమలు లేకున్నా తిరుపతికి చేరువగా వుండడం, జాతీయ రహదారుల కారణంగా చంద్రగిరిలో 36 ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, 12 రెస్టారెంట్లు, 22 దాబా హోటళ్ళు వున్నాయి. వరదయ్యపాలెం మండలంలో 35 ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఒక దాబా హోటల్ వుండగా చిల్లకూరు మండలంలో 22 ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, 2 రెస్టారెంట్లు, 3 దాబాలు చొప్పున మొత్తం 27 నడుస్తున్నాయి.



తడ మండలం బోడిలింగాల పాడు వద్ద స్టార్ హోటల్

కంచుగడప నుంచే స్థానికులకు దర్శనం

శ్రీకాళహస్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో స్థానికులకు కేటాయించిన టైంస్లాట్‌లో కంచుగడప నుంచే నేరుగా దర్శనానికి అనుమతిస్తామని ఈవో చంద్రశేఖర్ ఆజాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల ముక్కంటి ఆలయంలో స్థానికులకు ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం 7 నుంచి 8.30 గంటల వరకు దర్శనానికి అనుమతించేలా ప్రత్యేక టైంస్లాట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ముందుగా స్థానికులు ఆధార్‌కార్డుతో పీఆర్వో కార్యాలయానికి వెళ్లి అనుమతి రసీదు పొందిన తర్వాత కంచుగడప వద్ద చూపి ఆలయంలోకి వెళ్లేవిధంగా నిబంధనలు పెట్టారు. దీనిపై స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దాంతో పీఆర్వో కార్యాలయానికి వెళ్లి రసీదు తీసుకునే నిబంధనకు సడలింపు ఇస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు. కంచు గడప వద్ద నేరుగా ఆధార్‌కార్డు చూపి దర్శనానికి ప్రవేశించవచ్చని ప్రకటించారు.

విజన్ డాక్యుమెంట్ తయారీకి ఐఐటీ, ఐసర్ సలహాలు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ తయారీలో ఐఐటీ, ఐసర్, ప్రముఖ యూనివర్సిటీల సబ్జెక్టు నిష్ణాతుల సలహాలు, సూచనలు అవసరమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఏర్పేడు ఐఐటీలోని కాన్ఫరెన్సు హాల్‌లో శనివారం సాయంత్రం ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, యూనివర్సిటీల సబ్జెక్టు నిపుణులతో తిరుపతి జిల్లా విజన్ డాక్యుమెంట్ తయారీపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి కన్సల్టేటివ్ వర్క్‌షాపు నిర్వహించారు. జిల్లా గ్రోత్ రేట్ 15 శాతానికి తగ్గకుండా ఉండేలా పలు అంశాలపై చర్చించారు. పర్యాటక, ఆతిథ్యరంగం, విద్య, పరిశ్రమలు, మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్స్ ప్రమోషన్, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, వెంకటగిరి చీరలు, శ్రీకాళహస్తి కలంకారీ తదితర అంశాలపై నిపుణులు పలు సలహాలు, సూచనలు అందించారు. ఐఐటీ డైరెక్టర్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా పరిశ్రమల అవసరాల మేరకు నిపుణులను తయారు చేయాల్సి ఉంటుందని సూచించారు. గ్రామాలు, విద్యాసంస్థలు లింకేజీ చేయడం ద్వారా చాలా ఉపయోగం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అరవింద్‌కుమార్, రాహుల్ సిరోహి, చంద్రశేఖర్, హేమంత్‌కుమార్, ఉమాశంకర్, సత్య నాగరాజు, రామారావు, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఐసర్ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా భూమన

తిరుపతి (జీవకోన), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి, చిత్తూరు జిల్లాల వైసీపీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. చిత్తూరు జిల్లాతో పాటు తిరుపతి జిల్లాకు చెందిన తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలకు ఆయన అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా భూమనను పలువురు అభినందించారు.

సీఎం సహాయనిధికి అప్సా రూ.64 లక్షల విరాళం

తిరుపతి విద్య, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.64,04,854 అందజేసింది. అప్సా రాష్ట్ర అధ్యక్షుడు వి.సుబ్రహ్మణ్యంరాజు శుక్రవారం రాత్రి విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్కు అందజేశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఈ మొత్తాన్ని అందజేస్తున్నట్టు ఆయన ముఖ్యమంత్రికి చెప్పారు.



ముఖ్యమంత్రికి చెక్కు అందజేస్తున్న అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యరాజు

పొలం బాట



వాకాడు మండలం నిడిగుర్తి సమీపంలోని పొలాల్లోకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. వాకాడు డిపోకు చెందిన బస్సు శనివారం మధ్యాహ్నం మల్లాం నుంచి మూల పడవ గ్రామానికి బయలుదేరింది. నిడిగుర్తి సమీపంలోకి రాగానే ఒక్కసారిగా అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న ప్రయాణికులు ఉలికి పాటుకు గురయ్యారు. అయితే ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే బస్సు అదుపు తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

ఎరక్కపోయి వచ్చాను..ఇరుక్కుపోయాను



నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్‌కు వెళ్లే రహదారిలో కల్వర్టుకు భారీ గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతు చేసే క్రమంలో పరిమితికి మించి కల్వర్టు ఎత్తు పెంచారు. దీంతో సెజ్‌లోకి వచ్చే భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పైగా వర్షాలకు రోడ్డు బురదమయంగా మారింది. ఈ క్రమంలో శనివారం ఒక భారీ వాహనం ఆ ప్రాంతంలో ఇరుక్కుపోయింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గంటల తరబడి వాహనదారులు, ప్రయాణికులు రోడ్డుపై వేచి ఉండాల్సి వచ్చింది.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి

జగనన్న కాలనీ జలమయం

శ్రీకాళహస్తి పట్టణ శివారు రాజీవ్‌నగర్ కాలనీ వద్ద ఉన్న జగనన్న కాలనీ శనివారం జలమయమైంది. వేకువజామున 4 నుంచి 5 గంటల వరకు కురిసిన వర్షానికి పనస కాలువ నుంచి నీరు పొంగి జగనన్న కాలనీ వైపు ప్రవహించాయి. కాలనీలోని ఇళ్లు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. అక్కడ నివాసముంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ దృశ్యాలను కొందరు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి





కొండ శిఖరంపై



తటాకాల్లో ఈదులాడుతూ





నీటి మడుగు అడుగున దేవతా మూర్తితో - జలపాతం కింద



ఇక్కడే నివాసం

వనవాసి

ఎక్కడ పుట్టాడో, ఎప్పుడు పుట్టాడో, తల్లిదండ్రులెవరో తెలీదు. ఎలా వచ్చాడోగానీ పసి వయసు నుంచీ తిరుమలలో కనిపిస్తున్నాడు. ప్రసాదాలు తింటాడు.. బండలమీద పడుకుంటాడు.. ఒంటిమీద ఇంత గుడ్డ చుట్టుకుంటాడు.. ఉత్సవాల సమయాల్లో దివిటీలు పట్టుకునేవాళ్ల పక్కన చేరి తనూ అందుకుంటాడు. మాడవీధుల్లో తిరుగుతాడు. పేరు జైబాలాజీ. ఆ పేరును ఆయనే పెట్టుకున్నాడు. ఇప్పుడతని వయసు 50 ఏళ్ల ఉండచ్చు. తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనం సమీపంలో కృష్ణతేజ విశ్రాంతి భవనం వెనుకవైపు దట్టమైన చెట్ల నడుమ అతని నివాసం. పేర్చిన బండరాళ్ల మీద రేకు పైకప్పు. కరెంటుతో పనిలేదు. వంట లేదు. శ్రీనివాసుడి ఆరాధన తప్ప మరో ధ్యాస లేదు. చెట్టూ పుట్టా, పిట్టా పురుగూ, వాగూ వంకా.. తిరుమల అడవుల్లో ఆయనకు తెలియనివేవీ లేవు. భవిష్యత్తు గురించిన బెంగలేదు.. భయం అంటే ఏమిటో తెలీదు.. ఈ శేషాచలజీవికి. అడవిలో ఉంటే కాయాగసరూ తింటాడు. తిరుమలలో ఉంటే అన్నప్రసాదాలు తింటాడు. జైబాలాజీకి తెలియని తీర్థం, ఆయన ఎక్కని శిఖరం, దిగి తిరగని లోయ.. తిరుమల కొండల్లో లేవు. తిరుమల తీర్థాలకు ట్రెక్కింగ్ వెళ్లే బృందాలకు తోవ చూపుతాడు. వాళ్లతో కలిసి నడుస్తాడు. జలపాతాల కింద తడుస్తాడు. ఎత్తయిన బండలమీద నుంచి తటాకాల లోతుల్లోకి దూకి ఈదులాడుతాడు. తీర్థాల విశేషాలను వివరిస్తాడు. పిల్లనగ్రోవి ఊదుతూ ఏ పచ్చని చెట్టు కిందో ఉండిపోతాడు. తిరుమల అడవుల ఆనుపానులు తెలిసిన జైబాలాజీ కొంతకాలంగా యూట్యూబ్‌లో సందడి చేస్తున్నాడు. అడవిలో ఆయన జీవనశైలిని చిత్రించి కొందరు వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నారు. యూట్యూబ్ స్టార్‌గా మారిపోయిన ఈ అడవిబిడ్డ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కిక్కుకు 'అధికార' చిక్కులు

- అధినేత హెచ్చరించినా దారికి రాని 'తమ్ముళ్లు'
- జిల్లాలో పలుచోట్ల షాపులు పెట్టనివ్వని వైనం
- లక్కులో దక్కినా తలపట్టుకుంటున్న యజమానులు

తిరుపతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల విషయంలో జోక్యం చేసుకుని చెడ్డపేరు తేవద్దంటూ సీఎం చంద్రబాబు గట్టిగా వార్నింగ్ ఇచ్చినా జిల్లాలో కొన్నిచోట్ల కొందరు కూటమి నాయకుల తీరు మారినట్లు కనిపించడంలేదు. ఆయన హెచ్చరిక జారీ చేసి 24 గంటలు తిరక్కుండానే కొందరు తెలుగు తమ్ముళ్లు గాలికొదిలేసి తమదైన పెత్తనం ప్రదర్శిస్తున్నారు. అంతా తమ కనుసన్నల్లో జరగాల్సిందేనంటున్న వైనాలు జిల్లాలో బయటపడుతూనే ఉన్నాయి.

- ఏర్పేడు మండలానికి చెందిన 82వ నంబరు మద్యం షాపును పంగూరుకు చెందిన కిరణ్ కుమార్‌నాయుడుకు లాటరీలో దక్కింది. ఏ పార్టీకీ చెందని ఇతడు ఆమందూరు పంచాయతీ పరిధిలో ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారి పక్కన ఓ గది అద్దెకు తీసుకున్నారు. శనివారం మద్యం స్టాక్ తెచ్చుకున్నారు. అధికార పార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధి, పార్టీ నాయకుడు తమ అనుచరులతో కలసి ఇతడ్ని అడ్డుకున్నారు. గంటపాటు గొడవ జరిగింది. నిస్సహాయుడైన యజమాని షాపు తెరవలేక మద్యం స్టాక్‌ను వెనక్కు తీసుకెళ్ళిపోయాడు. షాపు ఏర్పాటు వల్ల మహిళలకు, విద్యార్థినులకు ఇబ్బంది అంటూ ఈ నాయకులు పైకి చెబుతున్నా అడ్డుకున్న స్థానిక ప్రజాప్రతినిధి మద్యం సిండికేట్ కీలక సభ్యుడని సమాచారం. మండల కేంద్రంలో షాపు ఏర్పాటు యత్నాల్లో ఉన్న తనకు ఆమందూరు పరిధిలో షాపు పెడితే వ్యాపారం తగ్గుతుందనే అడ్డుపడ్డారని తెలిసింది



ఏర్పేడులో షాపును స్థానికులు అడ్డుకోవడంతో మద్యం బాక్సులను వాహనంలో తరలిస్తున్న నిర్వాహకుడు

ఐదు షాపులు పెండింగ్

తిరుపతి రూరల్ మండలంలో 12 షాపులు కేటాయించగా ఇంకా ఏడు ఏర్పాటు కాలేదు. తిరుచానూరు సమీపంలో స్థానిక ప్రజాప్రతినిధి సోదరుడికి లాటరీలో రెండు షాపులు వచ్చాయి. వాటిని ఇచ్చేయాలంటూ కూటమి పార్టీల నేతలు, మద్యం సిండికేట్ సభ్యులు అతడిపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. తాము ఇచ్చినంత తీసుకుని వదిలిపెట్టేయాలని డిమాండ్ చేశారు. వినకపోవడంతో అతడి సోదరుడు, స్థానిక ప్రజాప్రతినిధి గతంలో ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని బెదిరించారు. ఆ దిశగా చర్యలకు కూడా దిగడంతో గత్యంతరం లేక రెండు షాపులూ సిండికేట్‌కే అప్పగించినట్టు సమాచారం.

బాలాయపల్లిలోనూ అదే పరిస్థితి

బాలాయపల్లిలో మద్యం షాపు దక్కించుకున్న వ్యక్తి పరిస్థితి కూడా డక్కిలి వ్యక్తి తరహాలోనే ఉందని టీడీపీ వర్గాల్లోనే ప్రచారమవుతోంది. షాపు తమకే ఇచ్చేయాలని అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు భీష్మించుకోవడంతో ఇంతవరకూ లైసెన్సుదారు షాపు ఏర్పాటు చేయలేదని భోగట్టా.

గూడూరులో సెటిల్‌మెంట్!

గూడూరు పట్టణానికి ప్రభుత్వం పది షాపులు కేటాయించింది.అందులో ఇప్పటి వరకూ రెండు మాత్రమే ఏర్పాటయ్యాయి. ఎనిమిది పెండింగులో వున్నాయి. ఏ షాపులో ఎవరెవరికి ఎంతెంత వాటాలు ఇవ్వాలనేది అక్కడి ముఖ్యనేత వద్ద ప్రస్తుతం సెటిల్‌మెంట్ నడుస్తోందని సమాచారం.

డక్కిలి షాపులో వాటాకు పట్టు

డక్కిలి మండల కేంద్రంలో రెండు షాపులుండగా ఒకటి రాజకీయాలకు సంబంధం లేని తటస్థ వ్యక్తికి దక్కింది. అతను షాపు ఏర్పాటు ప్రయత్నాల్లో ఉండగా అధికార పార్టీ నేతలిద్దరు షాపును తమకు ఇచ్చేయాలని పట్టుబట్టారు. యజమాని ఎదురు ప్రశ్నించడంతో పంచాయతీ ముఖ్యనేత వద్దకు వెళ్ళిందని తెలిసింది. తమ వాళ్ళు గత ఐదేళ్లలో బాగా నష్టపోయారని, కాబట్టి వారికి 40 శాతం వాటా ఇవ్వాలని పంచాయతీలో తేల్చి చెప్పారని సమాచారం. దీంతో షాపు యజమాని మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలిసింది.

రేణిగుంటలో నేతల జోరు

రేణిగుంట మండలంలోని పది షాపుల్లో ఆరు లాటరీలో టీడీపీ అనుకూలురు దక్కించుకున్నారు. మిగిలిన నాలుగు షాపులూ వైసీపీ అనుకూలురకు దక్కాయి. ఆ నాలుగూ ఇంతవరకూ ప్రారంభం కాలేదు. వాటిని ఏర్పాటు చేయకుండా ముఖ్యనేత పేరు చెప్పి అనుచరులు అడ్డుకుంటున్నారని తెలిసింది. షాపులు ఎలా నడుపుతారో చూస్తామంటూ బెదిరిస్తున్నట్లు సమాచారం.

ప్రారంభం కానిది 11 షాపులే

జిల్లాలో ఇప్పటి వరకూ 11 మద్యం దుకాణాలు మాత్రమే ప్రారంభం కాలేదని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. అధికార పార్టీ నేతలు గానీ సిండికేట్ పేరిట ఇతరులు గానీ లైసెన్సుదారులను అడ్డుకుంటున్నట్టు, బెదిరిస్తున్నట్టు తమ దృష్టికి రాలేదని చెబుతున్నారు. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్,చంద్రగిరి, శ్రీకాళహస్తిలలో మాత్రమే 11షాపులు ఏర్పాటు కావాల్సి ఉందంటున్నారు. అవి త్వరలోనే ప్రారంభమవుతాయంటున్నారు.





ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఆర్డీవో కిరణ్మయి - చికిత్స పొందుతున్న కార్మికులు

ఆటోను ఢీకొన్న లారీ

- డ్రైవర్ మృతి
- ఏడుగురు కార్మికులకు గాయాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం నాదెండ్లవారి కండ్రిగ వద్ద జాతీయ రహదారిపై శనివారం ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఉల్లా మునిరాజా(33) మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురి కార్మికులకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... దొరవారిసత్రం మండలం ఏకొల్లు, పూలతోట గ్రామాల నుంచి తడ మండలం మాంబట్టు పారిశ్రామికవాడలో ఉన్న ఓ పరిశ్రమలో పనిచేసే పది మంది కార్మికులు శనివారం విధులకు హాజరయ్యేందుకు ఆటోలో బయలుదేరారు. సూళ్లూరుపేట మండలం నాదెండ్లవారికండ్రిగ వద్ద వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మునిరాజా అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ఏకొల్లుకు చెందిన షకీనా, నీరజ, నిర్మల, ఈశ్వరి, పి.ఉదయ భాస్కర్, నేలపట్టుకు చెందిన పి.దేవి, విజయలక్ష్మికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ మురళీ కృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మనాయుడు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన కార్మికులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఆర్డీవో కిరణ్మయి ప్రభుత్వాస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఆటో డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల్లో మహిళలు అధిక సంఖ్యలో పనిచేస్తున్నారు. కంపెనీలు బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో కార్మికులు ఆటోల్లో వెళ్లి రావాల్సి వస్తోంది. ఈ విషయాన్ని క్షతగాత్రులు ఆర్డీవో కిరణ్మయి దృష్టి తీసుకెళ్లారు. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించేలా చూస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు.



మృతి చెందిన మునిరాజా(ఫైల్‌ఫొటో)

నాలుగు రోజుల్లో రూ.49.38 కోట్ల మద్యం విక్రయాలు

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నాలుగు రోజుల్లో రూ.49.38కోట్ల విక్రయాలు జరిగాయి. 227 దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేయగా ఇప్పటివరకు 218 ప్రారంభమయ్యాయి. ఇందులో తిరుపతి డివిజన్ పరిధిలో 125, గూడూరు డివిజన్ పరిధిలోని 93ఉన్నాయి. శనివారం వరకు 16,890 కేసుల బీర్లు, 9,179 కేసుల లిక్కర్ అమ్మకాలు జరిగాయి. తద్వారా ప్రభుత్వానికి రూ.49.38 కోట్ల ఆదాయం సమకూరింది. కాగా, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తిలోని మద్యం దుకాణాలు సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఎమ్మార్పీకి విక్రయించకపోయినా, సమయపాలన పాటించకపోయినా చర్యలు తప్పవని ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి తెలిపారు.

జిల్లాలో మోస్తరు వర్షం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన అల్పపీడనంతో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసిన విషయం విదితమే. తిరిగి శనివారం వేకువజామున గంటపాటు మోస్తరు వర్షం కురిసింది. తొట్టంబేడు మండలంలో 79.మి.మీ., బుచ్చినాయుడుకండ్రిగ 72.4, శ్రీకాళహస్తి 68.8, పిచ్చాటూరు 50.4, పెళ్లకూరు 50.2, దొరవారిసత్రం 48.2, నాగలాపురం 45.4, చిల్లకూరు 39.2, గూడూరు 37.4, ఏర్పేడు 34.2, సత్యవేడు 32.6, సూళ్లూరుపేట 32.4, రేణిగుంట 27.2, పాకాల 25.2, బాలాయపల్లి 24.8మి.మీ వర్షపాతం నమోదైంది.

స్కూల్‌వ్యాన్ బోల్తా ..పిల్లలు క్షేమం

కేవీబీపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్కూల్ వ్యాను అదుపుతప్పి బోల్తాపడింది. అయితే పిల్లలందరూ సురక్షితంగా బయటపడ్డారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు స్కూల్ వ్యాను శనివారం సాయంత్రం విద్యార్థులను ఇంటివద్ద దించడానికి కొండల్లో ఆదవరానికి బయలుదేరింది. ఎస్‌ఎల్‌పురం వద్ద ఎదురుగా కారుకు రావడంతో డ్రైవర్ వ్యాన్‌ను కాస్త పక్కకు తిప్పారు. దీంతో వ్యాను మట్టిలో దిగి పక్కకు ఒరిగిపోయింది. వ్యానులో ఏడుగురు పిల్లలు ఉన్నారు. వ్యాను ఒరుగుతుండగానే అందరూ దిగేశారు. ఎవరికీ గాయాలు కాలేదు. కాగా సింగిల్ రోడ్డు కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్డును మరింత విస్తరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బోల్తా పడిన స్కూల్‌వ్యాన్

భక్తులతో కిటకిటలాడిన అలిపిరి





తిరుపతి(వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తమిళులు ఎంతో పవిత్రంగా భావించే పెరటాసి మాసం ఐదో శనివారం కావడంతో తిరుమలకు కాలినడకన వెళ్లే భక్తులతో అలిపిరి కిటకిటలాడింది. అలిపిరి పాదాల మండపం నుంచి గాలిగోపురం వరకు భక్తులు పోటెత్తారు. మహిళలు దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు.



సఫాయి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రోగుల సేవలో తరిస్తున్న సఫాయి కర్మచారి(పారిశుధ్య కార్మికులు)లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను సక్రమంగా వర్తింపజేయాలని, వారికి ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్ వైద్యాధికారులకు ఆదేశించారు. రుయాస్పత్రి, స్విమ్స్‌లను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రుయాస్పత్రిలో పారిశుధ్య కార్మికులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, ఈఎస్‌ఐ, పీఎఫ్‌లు చెల్లించడంలేదని, డ్యూటీలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని కార్మికులు తెలిపారు. వెంటనే ఆయన కాంట్రాక్టు నిర్వాహకులను పిలిచి మందలించారు. బిల్లులు రాకపోవడం వల్ల జీతాలు ఇవ్వడం కొంత ఆలస్యమైందని ఏ-1 కాంట్రాక్టు నిర్వాహకుడు రవికుమార్ చెప్పగా వెంటనే ఫోన్లో డీఎంఈ నరసింహంతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్మికులకు పది రోజుల్లో జీతాలు చెల్లించాలని, నిబంధనల మేరకు వారికి సదుపాయాలు కల్పించాలని కాంట్రాక్టు నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం స్విమ్స్‌కు చేరుకుని స్విమ్స్ అధికారులు, సఫాయి కార్మికులు, కర్మచారీ సంఘం నేతలతో సమీక్షించారు. అక్కడ సఫాయి కార్మికులకు అందిస్తున్న సదుపాయాలను, జీతాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్నీ సకాలంలో అందుతున్నాయని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్మికులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా తన కార్యాలయ నంబరు 011-24648924కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవిప్రభు, ఏఆర్‌ఎంవో హరికృష్ణ, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎంఎస్ రామ్, ఆర్‌ఎంవో కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ సఫాయి కర్మచారీ కమిషన్ చైర్మన్ వెంకటేశన్

నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించాలి

తిరుపతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న సఫాయి కర్మచారీలకు ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్ తెలిపారు. శనివారం తిరుపతి కార్పొరేషన్‌లో సఫాయి కార్మికుల సమస్యలపై కమిషనర్ మౌర్యతో కలసి సమీక్షించారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ మస్టర్ గదులు తక్కువగా ఉన్నాయని, మహిళల కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

సూళ్లూరుపేటలో భారీ వర్షం



రైల్వేస్టేషన్ రోడ్డులో వర్షపునీరు

సూళ్లూరుపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో శనివారం భారీ కురిసింది. తుఫాన్ ప్రభావంతో నాలుగు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురవడంతో చెరువులు జలకళ రావడమే కాకుండా కాళంగి నది, నెర్రికాలువకు భారీగా నీరు చేసింది. రెండు విరామం అనంతరం మళ్లీ శనివారం తెల్లజామున 4నుంచి 6 గంటల వరకు భారీ వర్షం కురిసింది. మధ్నాహ్నం కూడా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారడమే కాకుండా గాండ్లవీధి, రైల్వేస్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్డుపై వర్షపు నీరు నిలబడడంతో వాహనదారులు, పాదచారులకు అవస్థలు తప్పలేదు.

గూడూరులో జోరు వాన

గూడూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం ఉదయం రెండుగంటల పాటు జోరుగా వర్షం కురిసింది. ఉదయం ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా రెండు గంటల పాటు పడింది. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండు రోడ్డు, త్యాగరాజవీధి, ఆస్పత్రి రోడ్లపై వర్షపునీరు చేరడంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వర్షాలతో పంట నష్టం లేదు

తడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాల వల్ల ఎక్కడా పంటనష్టం జరగలేదని ఏవో కాంచన తెలిపారు. శనివారం ఇరకందీవిలో ముంపునకు గురైన వరిపైరును పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు కొన్నిచోట్ల వరి నార్లు మాత్రం దెబ్బతిన్నాయన్నారు. అంతకు మించి ఎటువంటి నష్టం జరగలేదన్నారు. ఈ వర్షం ఎడగారి పైరుకు ఉపయోగపడిందని ఏవో అన్నారు.

పిడిగు పాటుతో గృహోపకరణాల దగ్ధం

బాలాయపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టికాడు గ్రామంలో శనివారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సుబ్రమణ్యం ఇంటిపై పిడుగు పడింది. దీంతో టీవీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, ఏసీ కాలిపోయాయి.

రేపు హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపు సోమవారం జరుగుతుందని దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

ఉచితంగా డీఎస్సీ శిక్షణ

వెంకటగిరి టౌన్, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి సన్నద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని సాంఘిక సంక్షేమాధికారిణి ఎం.లక్ష్మీరాజ్యం శనివారం తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బత్తలాపురంలో గ్రామసభ

ఓజిలి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం బత్తలాపురంలో శనివారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. గ్రామస్తులు భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ విజయ కుమార్, సర్వేయరు లక్ష్మీనారాయణ, వీఆర్వో మస్తానయ్య, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

జీఎన్‌టీ రోడ్డుకు మరమ్మతులు

సూళ్లూరుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఆర్అండ్‌బీ అధికారులు పట్టణంలో జీఎన్‌టీ రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నారు. పట్టణ ముఖ ద్వారం హోలీక్రాస్ సర్కిల్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు జీఎన్‌టీ రోడ్డులో గోతులు పడి అధ్వానంగా ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రోడ్డులో తట్టెడు మట్టి కూడా వేయకపోవంతో గుంతలమయంగా మారింది. శనివారం హోలీక్రాస్ సర్కిల్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.

తీరప్రాంత గ్రామాలకు
తారురోడ్డు కలేనా!

- అధ్వానంగా కొరిడి - పేర్నాడు దారి
- అటవీశాఖ అభ్యంతరాలతో అవరోధాలు
- మూడు పంచాయతీల ప్రజలకు నరకం





అధ్వానంగా ఉన్న కొరిడి - పేర్నాడు దారి, వర్షానికి కోతకు గురైన రోడ్డు

సూళ్లూరుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరిడి - పేర్నాడు దారిని తారు రోడ్డు మార్చేందుకు పర్యావరణ చట్టం ప్రతిబంధకంగా మారుతోంది. అటవీశాఖ అభ్యంతరాలతో తీరప్రాంత గ్రామాల ప్రజలకు తారు రోడ్డు కలగానే మిగిలిపోయింది. మండలంలో కొరిడి, దామరాయి, కడపట్ర పంచాయతీల పరిధిలో 23 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల ప్రజలంతా ఏ చిన్న పనికైనా సూళ్లూరుపేటకు రావాల్సిందే. సూళ్లూరుపేట నుంచి శ్రీహరి కోటకు వెళ్లే మార్గంలోని అట్టకానితిప్ప నుంచి పులికాట్ సరస్సు మీదుగా కొరిడి, దామరాయి, కడపట్ర పంచాయతీలకు వెళ్లాలి. సూళ్లూరుపేట నుంచి అట్టకానితిప్ప వరకు తారురోడ్డు ఉండగా, అక్కడ నుంచి కొరిడి, దామరాయి మీదుగా కడపట్ర పంచాయతీలోని పేర్నాడు వరకు 9 కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు ఉంది. ఈదారి పులికాట్ సరస్సు పరిధిలో ఉండడంతో రోడ్డు వేయాలంటే అటవీశాఖ అనుమతి తప్పనిసరి. పర్యావరణానికి భంగం కలుగుతుందని అటవీశాఖ చెబుతుండడంతో తారు రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వాలు ప్రయత్నాలు చేసినా నెరవేరడం లేదు. చిన్నపాటి వర్షమొచ్చినా గ్రావెల్ రోడ్డు కోతకు గురవుతోంది. దారి మొత్తం గోతులు పడి వాహనాలు వెళ్లలేని ఎదురవుతోంది. గత ఏడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాను ప్రభావానికి రోడ్డు దాదాపు రెండు కిలోమీటర్ల పైబడి కోతకు గురైంది. ఆర్టీసీ అధికారులు అప్పట్లో రెండు వారాల పాటు బస్సు సర్వీసును రద్దు చేశారు. మూడు రోజుల క్రితం తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి రోడ్డుపై పెద్దగుంత ఏర్పడింది. గ్రామస్తులే స్పందించి రాళ్లు, ఇసుక బస్తాలతో పూడ్చిపెట్టారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం మరమ్మతులు కూడా చేయక పోవడంతో రోడ్డు మొత్తం గుంతమయంగా మారింది. అనేకసార్లు పులికాట్ సరస్సులోకి బస్సు దూసుకెళ్లి ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. రోడ్డు బాగలేకపోవడంతో మూడు పంచాయతీల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుంది. కూటమి ప్రభుత్వం చొరత తీసుకుని కొరిడి - పేర్నాడు దారిని తారురోడ్డు మార్చాలని తీరప్రాంత గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

అత్త, మామపై దాడి కేసులో నిందితుల అరెస్టు



నిందితులను మీడియాకు చూపుతున్న పోలీసులు

గూడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఇందిరానగర్‌లో ఈనెల 13వ తేదీ రాత్రి అత్త, మామపై దాడి చేసి గాయపరిచిన కేసులో అల్లుడితో పాటు నిందితులను అరెస్టు చేసినట్లు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరానగర్‌కు చెందిన చెంచు కృష్ణయ్య, ధనమ్మ తమ కుమార్తె మహాలక్ష్మికి గత కొన్నేళ్ల క్రితం ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన సుబ్రహ్మణ్యంతో వివాహం జరిపించారు. చెంచుకృష్ణయ్య, అతని అల్లుడు సుబ్రహ్మణ్యం కలిసి పదేళ్ల క్రితం కందిపప్పు వ్యాపారం చేసేవారు. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యం బంధువు అయిన ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం గ్రామానికి చెందిన రమేష్‌కు మామ, అల్లుడు కలిసి రూ. 10లక్షలు అప్పుగా ఇచ్చారు. రమేష్ వ్యాపారంలో నష్టపోవడంతో బాకీ చెల్లించలేక బదులుగా తన గ్రామంలోని ఇంటిని సుబ్రహ్మణ్యంకు ఇచ్చేశాడు. ఆ ఇంటిని సుబ్రహ్మణ్యం తన మామ చెంచుకృష్ణయ్యకు తెలియకుండా అమ్ముకుని సొమ్ము చేసుకున్నాడు. నెల క్రితం ఈ విషయం తెలుసుకున్న చెంచుకృష్ణయ్య తన వాటా డబ్బులు ఇవ్వాలని అల్లుడిని అడగగా సుబ్రహ్మణ్యం నిరాకరించాడు. ఈ నగదు విషయమై మామ, అల్లుడుకి తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈనెల 10వ తేదీన చెంచు కృష్ణయ్య తన కుమార్తె ఇంటికి వెళ్లి తనకు రావాల్సిన నగదు ఇవ్వాలని ఆమెతో గొడవపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న సుబ్రహ్మణ్యం 13వ తేదీ రాత్రి మరో ఆరుగురు బంధువులతో కలిసి గూడూరుకు వచ్చారు. ఇందిరానగర్‌లోని అత్తా, మామలైన చెంచు కృష్ణయ్య, ధనలక్ష్మిపై ఇనుప రాడ్‌లతో దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారన్నారు. చెంచుకృష్ణయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్‌లోని పార్శిల్ కార్యాలయం వద్ద సుబ్రహ్మణ్యంతో పాటు అతని బంధువులైన విజయ్, భాస్కర్, సురేష్, రాజేష్, నరసింహను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. మరో నిందితుడు మనోహర్ పరారీలో ఉన్నాడని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐలు గోపాల్, సుబ్రహ్మణ్యంరాజు, సిబ్బంది చిరంజీవులు, సురేష్, నాగేంద్ర, సతీష్, మధు, కృష్ణారావు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరగనివ్వను: కురుగొండ్ల



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

డక్కిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం జరగనివ్వనని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హామీ ఇచ్చారు. శనివారం ఆల్తూరుపాడు వెల్లంపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత టీడీపీ హయాంలో రూ.400 కోట్లతో ఆల్తూరుపాడు గ్రామం వద్ద సోమశిల - స్వర్ణముఖి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నిర్మాణం చేపడితే వైసీపీ ప్రభుత్వం పనులను అర్ధాంతరంగా ఆపేసి రైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. రీటెండర్ ద్వారా 27 శాతం లెస్‌తో పనులు దక్కించుకొన్న కాంట్రాక్టర్ వైసీపీ నేతలకు ముడుపులు ఇచ్చుకోలేక పనులు ఆపేసి వెళ్లిపోయారని దుయ్యబట్టారు. మళ్లీ రిజర్వాయరు నిర్మాణం మొదలుపెట్టే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళితే ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఆల్తూరుపాడు వెల్లంపల్లి గ్రామానికి చెందిన కొంతమంది రైతుల సాగు భూములకు పట్టాలు లేని కారణంగా నష్టపరిహారం చెల్లించడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఈ విషయమై కలెక్టర్‌తో చర్చించడం జరిగిందన్నారు. వీరందరికీ నష్ట పరిహారం చెల్లించాలా లేక మరో చోట భూములు కేటాయించాలా అన్న విషయాన్ని జిల్లా అధికారులు పరిశీలిస్తున్నారని, త్వరలోనే రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అంతకుముందు ఆల్తూరుపాడు వెల్లంపల్లి గ్రామంలో ట్రాక్టరు ప్రమాదంలో మృతి చెందిన చెందిన టీడీపీ కార్యకర్త వేమల మల్లిఖార్జున కుటుంబాన్ని ఎమ్మెల్యే రామకృష్ణ పరామర్శించారు. ఆయన వెంట వెంకటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, తిరుపతి పార్లమెంటు వాణిజ్య విభాగం అధ్యక్షుడు పునుగోటి విశ్వనాధనాయుడు, డక్కిలి చంద్రారెడ్డి, వేముల నాగభూషణం నాయుడు, మునిస్వామి రెడ్డి, శివ ప్రసాద్ తదితరులు వున్నారు.

చట్టాలపై అవగాహన కలిగివుండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి అనూష

వెంకటగిరి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన చట్టాలపై విద్యార్థులు అవగాహన ఉండాలని వెంకటగిరి సివిల్ జడ్జి అనూష అన్నారు. శనివారం స్థానిక గురుకుల పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి న్యాయ చట్టాలలో కేంద్ర ప్రభుత్వం మార్పులను తీసుకువచ్చిందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించే దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాలలోని వంట గదిని పరిశీలించి మెనూ వివరాలతో పాటు భోజన నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి చేసిన కౌన్సిలర్‌ను కఠినంగా శిక్షించాలి

వెంకటగిరి, అక్టోబరు 19: అమ్మవారిపేట సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై ఈ నెల 18వ తేదీన దాడి చేసిన 5వ వార్డు కౌన్సిలర్ శేఖర్‌ను కఠినంగా శిక్షించాలని సచివాలయ ఉద్యోగ సంఘం నేతలు డిమాండ్ చేశారు. శనివారం సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యే రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ వార్డులోని కుళాయిల్లో నీళ్లు రావడం లేదన్న కారణంగా కౌన్సిలర్ నారి శేఖర్ ఫోన్‌లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయిని దుర్భాషలాడటమే కాకుండా కార్యాలయానికి వచ్చి దాడిచేసి గాయపరిచినట్లు తెలిపారు. ఆయనపై నాన్‌బెయిల్ కేసు నమోదు చేసి జైలుకు పంపాలని సచివాలయ ఉద్యోగ సంఘం నేతలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు కృష్ణారెడ్డి, సుబ్బరాయుడు, వెంకటసాయి, నాగరాజు, అశోకన్, శ్రీహరి, సత్యవేణి, మునీర్, స్పురాయులు, సుధ, సాయి తరదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం: నెలవల




సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నెలవల దంపతులు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 19: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని భీమవరం బీసీ కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నెలవల సుబ్రహ్మణ్యం, అమృత సరళ దంపతులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నేరవేరుస్తున్నారన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోను బాబు, తుపాకుల కన్నెమ్మ, గోపాలయ్య, సంచి రమేష్, ఆనాల రమేష్, గ్రామ కార్యదర్శి మల్లికార్జున్ పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లకు భూమిపూజ

నాయుడుపేట/బాలాయపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం గొట్టిప్రోలు పంచాయతీలో శనివారం పల్లె పండుగ కార్యక్రమాన్ని ఎంపీడీవో సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్లకు భూమిపూజ చేశారు. కార్యక్ర మంలో గొట్టిప్రోలు ఎంపీటీసీ సభ్యుడు పల్లమాల రామిరెడ్డి, సర్పంచు పరసా వెంకటరమణయ్య, టీడీపీ నాయకులు సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీవో షీల తదితరులు పాల్గొన్నారు. ● బాలాయపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. పెరిమిడిలో రూ.19 లక్షలు, భైరవరంలో రూ.10 లక్షలు, సంగవరంలో రూ.10 లక్షలు, నిడిగల్లులో రూ.10 లక్షలు, కాట్రగుంట రూ.8 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీడీవో వినీల్‌కుమార్, సర్పంచులు చప్పిడి గాయత్రి, పూడేటి వనమ్మ, ఎంపీటీసీలు రత్నమ్మ, రామయ్య, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ మోహన్ రాజు, ఏపీవో మృత్యుంజయరావు, నాయకులు దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, కూను శ్రీహరి, గుడి సురేష్, ఆది వెంకటకృష్ణారెడ్డి, దాసరి కోటేశ్వరావు, పులకంటి మురళి, మారెళ్ల వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకురాలికి డాక్టరేట్



వల్లీదేవి

కోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగ అధ్యాపకురాలు టి.వల్లీదేవికి డాక్టరేట్ లభించింది. అధునాతన మిషన్ నెర్లింగ్ టెక్నిక్ ద్వారా కనెక్ట్ చేయబడిన అటానమస్ వెహికల్స్‌లో సైబర్ సెక్యూరిటీని మెరుగుపరచడంపై సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో వల్లీదేవి పరిశోధనలు చేసి ఉత్తరప్రదేశ్‌లోని జేఎస్ యూనివర్శిటీకి పంపారు. ఉత్తమ పరిశోధనగా ఎంపికవడంతో జేఎస్ యూనివర్శిటీ వల్లీదేవికి డాక్టరేట్ ప్రదానం చేసింది. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, విభాగాధిపతులు షీల్డ్‌లు, మెమోంటోలతో వల్లీదేవిని అభినందించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కోట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటేష్ హెచ్చరించారు. మండల పరిధిలోని చిట్టేడు, కోటలోని బీసీ బాలుర వసతి గృహాలను శనివారం తనిఖీ చేశారు. సిబ్బందికి సంబంధించిన హాజరుపట్టి, విద్యార్థులకు పెడుతున్న మెనూ, స్టాక్ వివరాలను పరిశీలించారు. వార్డెన్ గజేంద్రకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

అక్రమణదారుడిపై చర్యలు తీసుకోండి

గూడూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాన్ని అక్రమించిన వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు శ్రీనివాసులు అన్నారు. మండలంలోని చెన్నూరు కటాలమ్మగుడి సమీపంలో బస్టాండు పక్కనే ఉన్న ఆర్అండ్‌బీ ప్రభుత్వ స్థలాన్ని చెన్నూరు గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమంచి నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

యూరియా పంపిణీ

గూడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు రైతుసేవా కేంద్రం వద్ద శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, హేమకుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్యామ్‌రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు గీతావాణి తెలిపారు. శనివారం మండలంలోని చిగురుపాడులో గ్రామసభ నిర్వహించారు. రీసర్వేలో ఏమైన సమస్యలు ఉంటే రైతులు గ్రామసభలో ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని చెప్పారు.

రెవెన్యూ తప్పులకు రైతులను బలిచేయొద్దు

పెళ్లకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో చేపట్టిన రీ సర్వేలో రెవెన్యూ యంత్రాంగం చేసిన తప్పులకు రైతులను బలి చేయవద్దని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ అన్నారు. శనివారం జీలపాటూరులో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ అధికారులు చేసిన తప్పులను సచివాలయం, మీ సేవలో దరఖాస్తు చేసుకుని చలానాలు కడితే పరిష్కరిస్తామనడం సబబు కాదన్నారు. రైతుల నుంచి వచ్చిన వినతులను అధికారులు పరిశీలించి పరిష్కరించాలని కోరారు. అనంతరం రైతుల నుంచి భూ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఆర్ఐ సంతోషి భాయి, మండల సర్వేయర్ పూజిత, గ్రామ సర్వేయర్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులు మృతి టీడీపీకి తీరని లోటు

చిట్టమూరు, అక్టోబర్ 19(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు గ్రామ టీడీపీ ప్రధాన కార్యదర్శి బందిలి శ్రీనివాసులు(35) మృతి తీరని లోటని ఆ పార్టీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు విచారం వ్యక్తం చేశారు. శ్రీనివాసులు శుక్రవారం మృతి చెందారు. శనివారం ఆయన మృతదేహానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. కిషోర్ నాయుడు, బాబునాయుడు, కార్యకర్తలతో కలసి పాడె మోసారు.